ప్రజాశక్తి

సోమవారం 4 ఆగస్టు 2025 8 పేజీలు




ఎన్‌టిఆర్



కృష్ణా

'స్మార్ట్'తో బిల్లుల మోత

- వినియోగానికంటే అధికంగా ఛార్జీలు
- విద్యుత్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- బలవంతంగా స్మార్ట్‌మీటర్లు బిగింపు
- ప్రజా వ్యతిరేకతతో ఇళ్లకు తాత్కాలిక బ్రేక్



ప్రజాశక్తి-నందిగామ

కూటమి ప్రభుత్వం అధికారంలో రాగానే విద్యుత్ ఛార్జీలు తగ్గించి ప్రతిఒక్క కుటుంబానికి ఉచితంగా సోలార్ ద్వారా విద్యుత్ ఇస్తామని చెప్పిన పాలకులు ఏరు దాటాక తెప్ప తెగలేసిన చందంగా స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను నిలువునా దోచుకుంటున్నారు నందిగామలో పలు వ్యాపార దుకాణాలతో పాటు ప్రైవేటు, ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారు. ఇళ్లకు కూడా స్మార్ట్ మీటర్లు పెట్టడానికి విద్యుత్ శాఖ అధికారులు సిద్ధం కావడంతో ప్రజల నుండి తీవ్ర వ్యతిరేకత రావడంతో తాత్కాలికంగా విరమించుకున్నారు. నందిగామలో సుమారు 1600కు పైగా దుకాణాలతో పాటు పలు చిన్న పరిశ్రమలకు స్మార్ట్ మీటర్లు బిగించారు.

స్మార్ట్ మీటర్లతో రెట్టింపు భారం

నందిగామలో స్మార్ట్ మీటర్ల దోపిడీకి వ్యాపారులు అల్లాడిపోతున్నారు. ట్రూ అప్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, ఎఫ్ పిపిసిఎ, ఎనర్జీ ఛార్జీలు, విద్యుత్ సుంకాలు, ఫిక్స్‌డ్ ఛార్జీలు, సర్ ఛార్జీలు, పాత బకాయిలు అంటూ ప్రతి నెలా వేలల్లో కరెంట్ బిల్లులు పెంచుతూ వినియోగదారులపై మోయవేని భారం మోపుతున్నారు. గడువు తేదీ దాటితే వంద నుండి రెండు వందల రూపాయలు జరిమానా వేస్తున్నారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలతో అల్లాడుతున్న ప్రజలపై మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా స్మార్ట్ మీటర్లు బిగించి చిన్న వ్యాపారుల నడ్డి విరుస్తున్నారు. స్మార్ట్ మీటర్లు బిగించిన తర్వాత వ్యాపారులు బిల్లులు చెల్లించలేక అప్పుల పాలవుతున్నారు.



నందిగామలో అపార్ట్మెంట్‌లకు సైతం స్మార్ట్ మీటర్లు బిగించటానికి అధికారులు సిద్ధమవుతున్నారు. నందిగామలో గత నాలుగు నెలల నుండి స్మార్ట్ మీటర్లు బిగించిన తర్వాత ప్రతి నెలా బిల్లులు రెట్టింపు స్థాయిలో వస్తున్నాయని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నందిగామ విజయ టాకీస్ రోడ్డులో ఒక హోటల్ వ్యాపారికి ప్రతి నెలా లక్షల్లో (మిగతా 2లో)

వ్యాపారులపై అదనపు భారం


ప్రజాశక్తి-తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండలంలో 270 మంది వ్యాపార సముదాయాలకు, 400 ప్రభుత్వ కార్యాలయాలకు కేటగిరి టు కింద స్మార్ట్ మీటర్లను విద్యుత్ శాఖ బిగించింది. ఈ స్మార్ట్ మీటర్లను బిగించిన తర్వాత బిల్లులు అమాంతంగా పెరిగి వస్తుండటంతో వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. స్మార్ట్ మీటర్లను బిగించడంతో నెలకు అదనంగా రూ.1000 నుంచి 1500 వరకు బిల్లులు పెరిగాయని వ్యాపారులు వాపోతున్నారు. గతంలో తనకు రూ.1750 బిల్లు వచ్చేదని స్మార్ట్ మీటర్ బిగించిన తర్వాత రూ.2500 బిల్లు వస్తుందని పాలబూత్, చిల్లరి కొట్టు వ్యాపారి వై.నాగేశ్వరరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గతంలో రూ.4400 బిల్లు వచ్చేదని స్మార్ట్ మీటర్ బిగించిన తర్వాతరూ 6,500 వరకు బిల్లు వస్తుందని దీనివల్ల అదనపు భారం పడుతుందని తెలిపారు. ఇలాగే ప్రతి ప్రభుత్వ కార్యాలయం మీద అదనపు భారం నెలకు రూ.వెయ్యి పైనే పడుతుందని ఉద్యోగులు తెలిపారు. స్మార్ట్‌మీటర్లకు తోడు విద్యుత్ అదనపు ఛార్జీలతో బిల్లులు కట్టలేకపోతున్నామని టిఫిన్ వ్యాపారం నిర్వాహకుడు వాపోయాడు.



వార్త 8లో

స్వచ్ఛ విజయవాడ సాధిద్దాం

- ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ
- పర్యావరణంపై నృత్య పోటీలు ప్రారంభం



బడి బయటే బాల్యం

- పేరుకే బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన
- పూర్తిస్థాయిలో దృష్టి పెట్టని యంత్రాంగం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

కృష్ణాజిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు గ్రహణం పట్టినట్లు కనబడుతుంది. గతంలో విద్యాశాఖ, సమగ్ర శిక్ష, కార్మిక శాఖ, రెవెన్యూ, స్త్రీ శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో ప్రతి సంవత్సరం బడులు ప్రారంభం తర్వాత బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించే వారు. నిబంధనలకు విరుద్ధంగా బాలలను పనిలో పెట్టుకున్న వారిని గుర్తించి వారిని పని నుండి విముక్తి కలిగించి బడిలో చేర్పించే వారు. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితులు జిల్లాలో ఎక్కడా కాన రావడం లేదు. దీంతో రోజురోజుకు జిల్లాలో బాల కార్మికుల సంఖ్య గణనీయంగా పెరిగిపోతుంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది విద్యా సంవత్సరంలో 5,089 మంది విద్యార్థులు బడి మానేసినట్లు విద్యాశాఖ గణాంకాలే చెబుతున్నాయి. (మిగతా 2లో)



దెబ్బతిన్న కాజ్‌వే



నాటు పడవపై ప్రయాణిస్తున్న ప్రజలు

వణికిపోతున్న పాతఎడ్లలంక

- వరద ఉధృతికి కూలిపోతున్న గృహాలు
- దెబ్బతిన్న కాజ్‌వే
- నాటు పడవలపై ప్రయాణం



నీట మునుగుతున్న గృహాలు (ఫైల్)

ప్రజాశక్తి-అవనిగడ్డ: ప్రకాశం బ్యారేజీ నుండి వరదనీరు విడుదల చేస్తే అవనిగడ్డకు కూత వేటు దూరంలో కృష్ణానది ద్వీపంలో ఉన్న పాత ఎడ్లలంక గ్రామ ప్రజలు వణికిపోతున్నారు. క్షణం ఒక యుగంలా గడుపుతున్నారు. గ్రామంలో 1100 మంది నివసిస్తుండగా అది ప్రత్యేక పంచాయతీగా కూడా కొనసాగుతుంది. గ్రామం ఉద్యానవన పంటలతో అలరారుతుంటుంది. అయితే ఆ గ్రామానికి తరచూ వచ్చే వరదలు శాపంగా మారాయి. ఏ చిన్న అవసరం వచ్చినా, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లాలన్నా అవనిగడ్డకు రావాల్సి ఉంటుంది. వరదలు వచ్చే సందర్భంలో అయితే ఆ గ్రామానికి బాహ్య ప్రపంచంతో పూర్తిగా సంబంధం తెగిపోతుంటుంది. వరదలు వచ్చినప్పుడు గ్రామస్తులకు మంచినీరు, ఆహారం సమస్య ఎదురవుతుంది. పశువులకు మేత కూడా దొరకని పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో బయట ప్రాంతానికి వచ్చేందుకు (మిగతా 2లో)

స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు నిరంతర ప్రక్రియ

- ఎన్‌టిఆర్ జిల్లాలో తొమ్మిది శాతం పూర్తి
- 'సూర్యఘర్'కు డిసెంబర్ 31 వరకు గడువు
- విజయవాడ సర్కిల్ ఎలక్ట్రికల్ ఎస్ఇ టి.శ్రీనివాసరావు





ప్రజాశక్తి-విజయవాడ

ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా ఇళ్లు, పరిశ్రమలు, వ్యాపార సంస్థలకు తొమ్మిది శాతం వరకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశామని, మిగిలిన వాటికి కూడా ఏర్పాటు చేస్తామని విజయవాడ సర్కిల్ ఎలక్ట్రికల్ ఎస్ఇ టి.శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లాలోని రూరల్ ఏరియా పలు మండలాలు, గ్రామాల ఇళ్లకు మినహాయించి, అమృత్ సిటీల జాబితాలో ఉన్న విజయవాడ నగరంలోని ఇళ్లతో పాటు జిల్లా వ్యాప్తంగా పరిశ్రమలు, వ్యాపార సముదాయాలకు స్మార్ట్‌మీటర్లు బిగిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, సూర్యఘర్ స్కీమ్ అమలు తదితర అంశాలపై ఎస్ఇ టి.శ్రీనివాసరావు 'ప్రజాశక్తి'కి ప్రత్యేక ఇంటర్వ్యూనిచ్చారు.

ప్రశ్న: ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా స్మార్ట్ మీటర్లను ఏ విధంగా ఏర్పాటు చేస్తున్నారు?

జవాబు: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా కార్యక్రమాన్ని (మిగతా 2లో)

మొదటిపేజీ తరువాయి

'స్మార్ట్'తో బిల్లుల మోత

కరెంట్ బిల్లు వస్తుండటంతో కట్టలేక కరెంట్ ఆఫీసు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గతంలో 250 నుండి 500 రూపాయలు వరకు వచ్చిన కరెంట్ బిల్లు నేడు స్మార్ట్ మీటర్ల బిగించడం ద్వారా 1300 నుండి 1500 రూపాయలు పైబడి కరెంటు బిల్లు వస్తుంది. కొంతమందికైతే 3500 నుండి 5 వేల రూపాయల వరకు కూడా కరెంటు బిల్లులు వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. పట్టణంలో ఒక సాధారణ చెప్పుల షాపుకి సాధారణంగా కరెంట్ బిల్లు నెలకు 200 నుండి 500 రూపాయలు మాత్రమే వచ్చేది కానీ స్మార్ట్ మీటర్ బిగించిన తర్వాత నెలకు 2 వేల నుండి 4 వేల రూపాయలకు పైబడి కరెంట్ బిల్లు వస్తుందని వ్యాపారి ఆందోళన వ్యక్తం చేశాడు. చెరువు బజారులో బిర్యాని వ్యాపారం చేసుకుంటున్న ఒక చిరు వ్యాపారికి స్మార్ట్ మీటర్ బిగించడం వల్ల 400 రూపాయలు వచ్చే కరెంట్ బిల్లు 1500 నుంచి 2 వేలు వస్తుందని వాపోయాడు.

స్మార్ట్ వద్దన్నా బిగిస్తున్నారు : దాసరి సత్యం



కరెంట్ బిల్లులు వేయడంలో నందిగామ ట్రాన్స్‌కో ఎఇ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇనుప కరెంట్ స్థంబాలు మార్చాలని పలుమార్లు అర్జీలు ఇచ్చిన పట్టించుకోవడం లేదు. స్మార్ట్ మీటర్లు వద్దన్నా పట్టించుకోకుండా బిగిస్తున్నారు. కరెంట్ బిల్లులు గతం కంటే రెట్టింపు వస్తున్నాయి.

అధికంగా కరెంటు బిల్లులు : మల్లెంపూడి రాము, హోటల్ వ్యాపారి



స్మార్ట్ మీటర్లు బిగించక ముందు కరెంట్ బిల్లు వెయ్యి రూపాయల్లోపు వచ్చేది. ప్రస్తుతం స్మార్ట్ మీటర్లు బిగించిన తర్వాత కరెంట్ బిల్లు 3500 నుండి 4 వేలకు పైగా వస్తోంది.

పాత మీటర్లు కొనసాగించాలి : కళావతి, చిల్లర కొట్టు



స్మార్ట్ మీటర్లు బిగించవద్దని చెప్పినా విద్యుత్ సిబ్బంది అడ్డగోలుగా బిగించారు. తక్షణమే స్మార్ట్ మీటర్లు తొలగించాలి. పాత కరెంట్ మీటర్లు ఉంచాలి. విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయి. వ్యాపారాలు లేవు. విద్యుత్ బిల్లు కట్టలేకపోతున్నాను.

బడి బయటే బాల్యం

బడి మానేసిన వారంతా ఏ పనులకు వెళ్లారనేది ప్రభుత్వానికి, అధికారులకే తెలియాలి. ప్రభుత్వ ఆర్థిక విధానాల పుణ్యామాని నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. దీనివల్ల కుటుంబంలో ఆర్థికపరమైన భారాలు ఎక్కువవుతున్నాయి. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు కుటుంబాలను పోషించుకునేందుకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. నేటికి రెక్కాడితేనే గాని డొక్కాడని అనేక కుటుంబాలు పేదరికంలో మగ్గుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ఇంటిల్లపాదీ పనులకు వెళితేనేగానీ కుటుంబాలను పోషించుకునే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలోనే తల్లిదండ్రులు వారి పిల్లలను కూడా పనులకు తీసుకెళ్తున్నారు. పనులకు వెళ్లకుండా వారికి కావాల్సిన అవసరాలను తీర్చడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుంది. బాల కార్మిక వ్యవస్థ అదే రీతిన పెరుగుతూ వస్తుంది. జిల్లాలో ఎక్కడ చూసినా వందల సంఖ్యలో బాల కార్మికులు దర్శనమిస్తున్నారు. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా అనేక ప్రాంతాల్లో అనేక చోట్ల బాలకార్మికులు పని చేస్తూ కనిపిస్తున్నారు. ముఖ్యంగా మెకానిక్ షెడ్డులు, హోటళ్లు, పాన్ షాపులు, ఇటుక బట్టీలతో పాటు మద్యం దుకాణాల్లో బాలకార్మికులు కనిపిస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా వేలాది మంది బాల కార్మికులు కూలీ పనుల్లో మగ్గిపోతున్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెప్పుకొస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం బాల కార్మికులను గుర్తించి వారిని బడికి పంపాలన్న ఆలోచన చేయడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారిక లెక్కల్లో మాత్రం బాలకార్మికుల సంఖ్యను నామమాత్రంగానే చూపుతుండటం శోచనీయం. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చట్టాలు ఉన్నా అవి సక్రమంగా అమలు కావడం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో రేపటి భావిభారత పౌరుల పరిస్థితి దయనీయంగా మారుతుందని అవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పూర్తిస్థాయిలో చర్యలకు దిగితే ఈ వ్యవస్థ నిర్మూలనలో కాస్తయినా మెరుగుదల కనిపిస్తుందని, ఈ నేపథ్యంలో అటు అధికారులు, ఇటు ప్రభుత్వం పూర్తిస్థాయిలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారి పివిజె రామారావును వివరణ కోరగా ఈ ఏడాది ప్రత్యేక డ్రైవర్ నిర్వహించలేదని, ప్రభుత్వం నుండి తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని చెప్పారు.

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు

• 6న మహాధర్నాకు మద్దతు • రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కాశీనాథ్

ప్రజాశక్తి-విజయవాడ: అతి విలువైన ఆర్‌టిసి, ప్రభుత్వ స్థలాలను లూలూ కార్పొరేట్ కంపెనీలకు అప్పగిస్తూ విడుదల చేసిన జీఓ నెంబర్ 137కు వ్యతిరేకంగా ఉద్యమించాలని సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. విజయవాడ నగరంలో ఆర్‌టిసి పాత బస్‌స్టాండ్ స్థలాన్ని లులూ గ్రూపునకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జివో నెం 137ను వ్యతిరేకిస్తూ ఆదివారం సిపిఐ విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో దాసరి భవన్‌లో ఆ పార్టీ నగర అధ్యక్షులు జి.కోటేశ్వంరావు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ రూ.400 కోట్ల విలువ కల్గిన 4.15 ఎకరాల విజయవాడ పాత బస్టాండ్‌ను లూలూ కంపెనీకి దారాదత్తం చేస్తూ విడుదల చేసిన జీఓ నెంబర్ 137ను రద్దు చేయాలని, దీనికి వ్యతిరేకంగా ఐక్యంగా అందరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 6వ తేదీన పౌరవేదిక ఆధ్వర్యంలో జరుగనున్న మహాధర్నాకు సిపిఐ మద్దతు ప్రకటిస్తుందన్నారు. నగర మాజీ మేయర్ జంధ్యాల శంకర్ మాట్లాడుతూ ఆర్‌టిసి స్థలాన్ని లులూ సంస్థకు అప్పగించడాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాద్ మాట్లాడుతూ ఆర్టీసి విలువైన స్థలాలను లూలూ కంపెనీకి అప్పగించరాదని, జీఓ నెంబర్ 137 రద్దు అయ్యేంత వరకు రాజీలేని పోరాటం చేయాలని, ఇప్పటికే ఆర్టీసి స్థలాల పరిరక్షణా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన ధర్నాకు పిలుపునివ్వడం జరిగిందని అన్నారు. ఆర్టీసి సంఘాలతో పాటు పౌర సంఘాలు, చాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్లు, వర్తక, వాణిజ్య సంస్థలు, మేధావులు, పురప్రముఖులు అందరూ ఏకమై ఐక్యంగా ఉద్యమించి, ఆర్టీసి స్థలాలను కాపాడుకోవాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు మాట్లాడుతూ లులూ వంటి వ్యాపార సంస్థలు నగర ప్రవేశంతో చిన్న, మధ్యతరహా వ్యాపారులు మూతపడే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు పి.ప్రసాద్, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు హరనాథ్, ఎస్‌యుసిఐ నాయకులు సుధీర్ బాబు, సిపిఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జివి నరసయ్య, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎండి ప్రసాద్, జోనల్ కార్యదర్శి వైఎస్ రావు, ఎఐటియుసి నగర అధ్యక్షులు కె.ఆర్. అంజనేయులు పాల్గొన్నారు.

స్వచ్ఛ విజయవాడ సాధిద్దాం : కలెక్టర్



ప్రజాశక్తి-విజయవాడ సిటీ

పర్యావరణ పరిరక్షణకు వివిధ రూపాల్లో ప్రజలను చైతన్యవంతం చేసేందుకు కార్యక్రమాలు నిరంతరాయంగా నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. స్వచ్ఛ విజయవాడ సాధనలో భాగంగా జిల్లా యంత్రాంగం, నగరపాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో హరిత బెరం పార్కులో సంప్రదాయ నృత్య పోటీలను జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలోని ఔత్సాహిక నృత్య కళాకారులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించేందుకు ఇటువంటి వేదికలు దోహదపడతాయన్నారు. విజయవాడ నగరం ప్రతిభావంతులైన కళాకారులకు కేంద్రంగా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణపై తరచుగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజలలో అవగాహన పెరుగుతుందన్నారు. ఇప్పటికే నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం కొనసాగుతోందన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్ఎం ధ్యానచంద్ర మాట్లాడుతూ ప్లాస్టిక్ ఉత్పత్తుల నిరోధంపై ప్రజలలో చైతన్యం పెంచేందుకు వివిధ కళారూపాలతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించడంలో భాగంగా వరుసగా ఐదు ఆదివారాలు ఈ నృత్య పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలలో వయస్సుల వారీగా కళాకారులు తమ ప్రదర్శనలు ఇస్తున్నారన్నారు. ఇటువంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం స్వచ్ఛ విజయవాడ సాధన కోసమేనన్నారు. ఐదో ఆదివారం విజేతలకు బహుమతి ప్రదానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ యస్. ఇలక్కియ, మేరీటైం బోర్డు సీఈవో ప్రవీణ్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

వణికిపోతున్న పాతఎడ్లలంక

నాటు పడవలపై ప్రయాణం చేయాల్సి ఉంటుంది. 2009లో వచ్చిన వరదలలో కొందరు నాటు పడవల మీద ఒడ్డుకు చేరుకునే క్రమంలో పడవ తిరగబడి ఇద్దరు చిన్నారులు వరద ఉధృతికి కొట్టుకుపోయారు. అప్పటినుండి అధికారులు వరద ఉధృతి పెరిగితే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఇవేవీ వారికి పూర్తి రక్షణ కల్పించలేకపోతున్నాయి. ముఖ్యంగా గ్రామం చుట్టూ కృష్ణానదిలో ఉన్న ఇసుక బుసక తరలిస్తుండటంతో నదీ ప్రవాహం దిశ మార్చుకుని గ్రామాన్ని ధ్వంసం చేస్తుంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా గత ఏడెనిమిది సంవత్సరాల నుండి వరదల వల్ల గ్రామం కోతకు గురై గృహాలు నదిలో కలిసిపోతున్నాయి. దీనితో గ్రామస్తులు మరింత ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారుతున్నా గ్రామ రక్షణ కోసం తీసుకుంటున్న చర్యలు శూన్యం. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఒక కాజ్ వే నిర్మించగా అది 2009లో వచ్చిన వరదలకు కొట్టుకుపోయింది. దీనితో ఆ గ్రామానికి రహదారి సౌకర్యం లేకుండా పోయింది. తాత్కాలికంగా వరద తగ్గిన తర్వాత బుసుకతో రహదారి నిర్మించినప్పటికీ చిన్నపాటి వరదకే అవి తెగిపోయి పడవలపై ప్రయాణం చేయవలసిన పరిస్థితి గ్రామస్తులకు ఏర్పడుతుంది. వరద ఉన్నా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పడవపై ప్రయాణం చేసి అవనిగడ్డకు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో వరదలు వచ్చినప్పుడు రాజకీయ నాయకులు ఆ గ్రామానికి చేరుకుని తాము బ్రిడ్జి నిర్మిస్తామని అధికారంలో ఉన్నవారు హామీ ఇస్తుండగా తాము అధికారంలోకి వస్తే బ్రిడ్జి నిర్మాణంతో పాటు గ్రామం చుట్టూ కోతకు గురికాకుండా రివిట్ నిర్మిస్తామంటూ ప్రతిపక్షంలో ఉన్నవారు చెప్పడం రివాజ్‌గా మారింది. ఎప్పటికప్పుడు రాజకీయ నాయకులు పబ్బం గడుపుకునే వాగ్దానాలు చేయడం తప్ప ఇప్పటివరకు గ్రామానికి శాశ్వత పరిష్కారం అనేది ఎవరు చేయలేకపోతున్నారు. వరదలు వచ్చినప్పుడల్లా ఎప్పుడు ఏ ఉపద్రవం ముంచుకొస్తుందో అంటూ బిక్కుబిక్కుమంటూ బతకాల్సి వస్తోందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి-చల్లపల్లి: స్థానిక నారాయణరావునగర్‌లోని విజయవాడ గురుకుల పాఠశాలకు వెళ్లే రహదారి ప్రక్కన విద్యుత్ స్తంభాలు ప్రక్కకు ఒరిగి పడిపోయేటట్టుగా ఉన్నాయి. ప్రమాదము జరగకముందే అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని సిఐటియు మండల కన్వీనర్ మహమ్మద్ ఖరీముల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు.



స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు నిరంతర ప్రక్రియ

రూపొందించుకుని స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తున్నాం. అమృత్ సిటీస్ జాబితాలో ఉన్న విజయవాడ నగరంలో ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. రూరల్ ఏరియాలోని ఇళ్లకు మాత్రం ప్రస్తుతానికి స్మార్ట్‌మీటర్లు బిగించేది ఉండదు. మిగిలిన పరిశ్రమలు, వ్యాపార సంస్థలకు రూరల్ ఏరియాలో కూడా స్మార్ట్‌మీటర్లు బిగించడం జరుగుతుంది. జిల్లాలో సింగిల్ ఫేజ్ కింద 9,56,049 విద్యుత్ కనెక్షన్లకు 96,783 (పది శాతం) స్మార్ట్‌మీటర్లు బిగించడం జరిగింది. త్రి ఫేజ్ కింద ఉన్న మూడు లక్షల కనెక్షన్లకు 20,049 వరకు స్మార్ట్ మీటర్లు బిగించారు. మొత్తం మీద ఎనిమిది నుంచి తొమ్మిది శాతం వరకు స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియ పూర్తయ్యింది.

ప్రశ్న: స్మార్ట్‌మీటర్ భారం వినియోగదారుడిపై పడుతుందా?

జవాబు: స్మార్ట్‌మీటర్ల భారం వినియోగదారుడిపై పడదు. ఈ ఖర్చు మొత్తం ప్రభుత్వాలే భరిస్తాయి.

ప్రశ్న: ప్రతి నెలా జిల్లాలో డిమాండ్ ఎంత ఉంటుంది?

జవాబు: జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా రూ.283 కోట్లు డిమాండ్ ఉంటుంది. అలాగే మరో రూ.355 కోట్లు మేర ఎరియర్స్ రూపంలో సంస్థకు జమ కావాల్సి ఉండగా ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన విద్యుత్ బకాయిలు ఎరియర్స్ జాబితా నుంచి మినహాయించి చూపించడం జరిగింది.

ప్రశ్న: జిల్లా వ్యాప్తంగా విద్యుత్ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయి.?

జవాబు: జిల్లాలో ఆయా రంగాలకు సంబంధించి 19,26,062 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో పరిశ్రమలకు 6,848 కనెక్షన్లు, వ్యాపార దుకాణాలు, సంస్థలకు రెండు లక్షలు, గృహాలకు 15,43,033 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటితో పాటు 1,45,902 వ్యవసాయ కనెక్షన్లు, అలాగే హెచ్‌టి లైన్లకు సంబంధించి 1427 కనెక్షన్లు ఉన్నాయి.

ప్రశ్న: 'సూర్యఘర్' స్కీమ్ అమలు ఎలా ఎంది?

జవాబు: సూర్యఘర్ (సూర్యరశ్మి ద్వారా విద్యుత్ ఉత్పత్తి) స్కీమ్ ద్వారా సోలార్ ప్యానల్స్ ఇళ్లపై ఏర్పాటు చేయడానికి వచ్చే డిసెంబర్ 31 వరకు ఆఖరి గడువుగా ప్రభుత్వం పొడిగించింది. వాస్తవంగా ప్రభుత్వం నిర్దేశించిన కాల వ్యవధి గత జూన్ 30 తేదీ మాత్రమే. స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సూర్యఘర్ స్కీమ్‌లో భాగంగా సోలార్ ప్యానల్స్ ఇళ్లపై బిగించాలని దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే వీటిని ఏర్పాటు చేయడం జరుగుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన సబ్సిడీని ఉపయోగించుకొని ఈ స్కీమ్ ద్వారా జిల్లాలో 3,286 మంది లబ్దిదారులకు సోలార్ ప్యానల్స్‌ను ఇళ్లపై బిగించడం జరిగింది. సూర్యఘర్ స్కీమ్ కింద ఒక కిలో వాట్ విద్యుత్ ఉత్పత్తికి రూ.80 వేలు ఖర్చు అవుతుంది. దీనిలో రూ.30 వేల వరకు ప్రభుత్వ రాయితీ ఉంటుంది. మిగిలిన డబ్బులో రూ.45 వేల వరకు బ్యాంక్ లోను ద్వారా సమకూర్చుకోవచ్చు. రూ.5 వేలు మాత్రమే కస్టమర్ చెల్లించాల్సి ఉంటుంది. అలాగే రెండు కిలో వాట్స్‌కు రూ.1.45 లక్షలు ఖర్చు అవుతుండగా దానిలో 60 వేలు సబ్సిడీ, మరో 70 వేలు బ్యాంక్ లోను, రూ.15 వేలు కస్టమర్ కట్టాల్సి ఉంటుంది. ఆదే విధంగా మూడు కిలో వాట్స్ విద్యుత్ ఉత్పత్తికి రూ.20 వేలు మేర కస్టమర్ చెల్లించాల్సి ఉంటుంది.

స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా 5న ధర్నాలు

- జయప్రదం చేయాలని కరపత్రాలు పంపిణీ, సంతకాలు సేకరణ



ఉయ్యూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎం.హరిబాబు

ప్రజాశక్తి-ఉయ్యూరు : సర్దుబాటు విద్యుత్ చార్జీలు స్మార్ట్ మీటర్ల బిగింపు ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో సామాన్యుడిపై పెను భారంగా మారిన అన్నింటిని రద్దు చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు అన్నారు. ఆదివారం ఉయ్యూరు పట్టణంలోని కాలవ గట్టుపై సుందరయ్య నగర్ లో విద్యుత్ ఛార్జీలను వ్యతిరేకిస్తూ ఆగస్టు 5న జరిగే ధర్నా కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కరపత్రాలు పంపిణీ చేశారు. బడా కార్పొరేట్ సంస్థలైన అదానీ అంబానీలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులకు మడుగులు ఒత్తుతున్నాయని ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని ఆయన దుయ్యబట్టారు. విద్యుత్ ఛార్జీల పేరుతో స్మార్ట్ గా ప్రజలను దోచేస్తున్నారని సామాన్య మధ్యతరగతి ప్రజలు విద్యుత్ బిల్లులతో భారమైన జీవనాన్ని గడుపుతున్నారని వీటన్నిటికీ వ్యతిరేకంగా ప్రజలందరూ స్వచ్ఛందంగా ధర్నా నిరసన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బి రాజేష్ పట్టణ సభ్యులు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** ప్రజా వేదిక ఆధ్వర్యంలో కంకిపాడు మండలంలోని కుందేరు గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేసిన సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ప్రజావేదిక నాయకులు టి నరేష్, నాయకులు మరీదు శ్రీనివాసరావు, పి సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-తోట్లవల్లూరు :** స్మార్ట్ మీటర్లను బిగించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నాయని మండల సిపిఎం నాయకులు జుజ్జవరపు యోసేపు అన్నారు. ఆదివారం ఏమినేని లెనిన్‌తో కలిసి వల్లూరుపాలెం గ్రామంలో ఇంటింటికి తిరిగి స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా కర పత్రాల పంపిణీ చేశారు. కరపత్రాలు పంపిణీ చేసి స్మార్ట్ మీటర్ల పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆగస్టు ఐదున జరిగే మహా ధర్నాలో ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** స్మార్ట్ మీటర్ల బిగింపు కారణంగా చిన్నపాటి వ్యాపారస్తులపై మోయలేని భారం పడిందని ప్రజా వేదిక నాయకులు మీర్ రిజ్వాన్ అన్నారు. శనివారం స్మార్ట్ మీటర్ల బిగింపులకు వ్యతిరేకంగా వ్యాపారస్తులను చైతన్యవంతం చేస్తూ కరపత్రాలు పంపిణీ చేసి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వ్యతిరేకంగా ఈనెల 5వ తేదీన విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద చేపట్టిన నిరసనను జయప్రదం చేయాలని వ్యాపార సంస్థలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యద్దనపూడి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ :** ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మొవ్వ మండలం మొవ్వ గ్రామంలో విద్యుత్ ఛార్జీలు భారాలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు రద్దు చేయాలని కోరుతూ ఇంటింటికి సంతకాల సేకరణ ఆదివారం నిర్వహిఆంచారు. ఆగస్టు 5 వ తేదీన మండల కేంద్రాల్లో జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం నారాయణరావు , సిఐటియు మండల కార్యదర్శి కాకి రాజశేఖర్, సభ్యులు చిగురుపల్లి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసే పదాన్ని స్మార్ట్ మీటర్లను పెట్టనియొద్దని, ప్రజలు చైతన్యంతో వ్యవహరించాలని ప్రజా వేదిక నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, కాట్రగడ్డ జోషి పిలుపు నిచ్చారు. ఆదివారం మండలంలోని మల్లన్న పల్లి గ్రామంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరికి కరపత్రం ఇవ్వడం ద్వారా స్మార్ట్ మీటర్ వల్ల కలిగే నష్టాలను వివరించారు. దీనిపై మహిళలు తీవ్రంగా స్పందించారు. స్మార్ట్ మీటర్ మా ఇంటిలోకి రానీయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కట్టేవరపు విజయరావు, చాగంటిపాటి వెంకటేశ్వరరావు, శివా చారి, స్థానికులు పాల్గొన్నారు.అలాగే గన్నవరం మండలం ముస్తాబాద్ గ్రామంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రచారం, సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళ్ళం వెంకటేశ్వరరావు, కళ్ళం రాంబాబు, నాగరాజు, ఏసుదాసు, ఆంతోని, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తిలి-బంటుమిల్లి :** ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బంటుమిల్లి మండలంలో మలపరాజు గూడెంలో స్మార్ట్ మీటర్లు మాకొద్దు.. పెంచిన ట్రూప్ చార్జీలు తగ్గించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రజాసంఘాల ఐక్య వేదిక నాయకులు పరుచూరి ధనశ్రీ, మాజేటి శివ శ్రీనివాసరావు, కోరు ఝాన్సీ లక్ష్మీబాయి పాల్గొన్నారు



గన్నవరం మండలంలో...



చల్లపల్లిలో...



బంటుమిల్లిలో..



మొవ్వ మండలంలో...

పిడుగుపాటుకు మహిళ మృతి



ప్రజాశక్తి-కోడూరు : కోడూరు మండలం ఇరాలి గ్రామానికి చెందిన గంజాల కొండలమ్మ (30) పిడుగు పాటుకు గురై ఆదివారం మృతి చెందింది. వ్యవసాయ పనులకని వెళ్లిన ఆమె విగతజీవిగా మారడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవు తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొండలమ్మ,వీరబాబు దంపతులు ఒకరు మురుగు కాలువలో (చేపల) మావులు పెడుతూ, మరొకరు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు మగ పిల్లలు. కాగా రోజూలానే ఆమె ఆదివారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లారు. భర్త మావులు పెట్టడానికి వెళ్లగా, కొండలమ్మ తొటి కూలీలతో కలిసి కోడూరు శివారు నరసింహపురం గ్రామ సమీపంలో ఉన్న పొలానికి నాటుకి వెళ్లింది. అయితే ఇంతలో ఒక్కసారిగా వాతావరణం మారి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. అదే సమయంలో ఆ ప్రాంతంలో పిడుగు పడ డంతో పిడుగు శబ్దానికి ఆమె అక్కడికక్కడే మతి చెందింది. ఆమెతో పాటు నాటు వేస్తున్న గంజాల జ్యోతి ,గంజాల పార్వతి పిడుకు తాకిడికి గాయపడగా వారిని వెంటనే ఆస్పత్రికి తరలిం చారు.

స్థల వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు పట్టణ నడిబొడ్డున స్థల వివాదం ఇరువర్గాలు దాడులకు పాల్పడ్డారు. గౌడరామాలయం సమీపాన పాత షాదీఖానా రోడ్డులో వివాదాస్పద ఖరీదైన స్థలంలో శుక్రవారం రాత్రి ఓవర్గం షెడ్డు వేసేందుకు పూనుకోగా మరొక వర్గం అడ్డుకునేందుకు ప్రయత్నించగా ఘర్షణ ఏర్పడి తోపులాటలో ఉద్రిక్తత చోటుచేసుకోగా పోలీసులు వచ్చి సద్దుమణిగేల చేశారు. వివరాల ప్రకారం ముస్లిం మైనారిటీ వర్గానికి చెందిన ఇంటి స్థలాన్ని కొన్ని సంవత్సరాల క్రితం ఓ వస్త్ర వ్యాపారి మైనారిటీ వర్గానికి చెందిన అన్నతమ్ములలో ఒకరి నుండి కొంతమేర కొనుగో లుచేసి రిజిష్టర్ చేయించుకోగా మిగిలిన స్థలాన్ని మరొక సోదరుడు వేరే వ్యక్తికి విక్ర యించి కాంట్రాక్టు రాసి కొంతకాలానికి అదే స్థలాన్ని తన సోదరిలకు గిఫ్ట్‌గా ఇచ్చి రిజిష్టన్ చేశాడు. సోదరుడు గిఫ్ట్ ఇచ్చిన స్థలాన్ని వారు మరొక వ్యక్తికి విక్రయించి రిజిష్టర్ చేశారు. ఆవిధంగా కొనుగోలుచేసిన వ్యక్తి ఆస్థలం స్వాధీన పరుచుకుని షెడ్డు నిర్మించేందుకు సిద్ధమవడంతో అంతకుముందు కొనుగోలు చేసిన వారు అడ్డుకోగా వి వాదం తలెత్తి ఘర్షణకు దారితీసింది. పోలీసులు వెళ్లిన తరువాత స్థలంలో రాత్రికి రా త్రే షెడ్డు నిర్మాణం పూర్తిచేయగా ఉద్రిక్తత నెలకొంది.

గన్నవరం ఎస్ఐగా కిషోర్ బాధ్యతలు



ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం పోలీస్ స్టేషన్ ఎస్ఐ -2 గా పరిమి కిషోర్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ముందుగా సీఐ బి.వి. శివప్రసాద్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన 2014 బ్యాచ్. గతంలో వీరులుపాడు, నందిగామ, ఆగిరి పల్లి, విస్సన్నపేట, విజయవాడ సెంట్రల్ క్రైమ్ లో పనిచేశారు. గన్నవరం స్టేషన్‌లో రూరల్ గ్రామాలను ఈయన చూస్తారు.

నందూరి మృతికి నివాళులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ మండల పరిధిలోని రామకోటి పురం గ్రామానికి చెందిన నందూరి శ్రీనివాసరావు కుమారుడు వేణు గత కొన్ని రోజులుగా అనారోగ్యం కారణంగా విజయవాడ మణిపాల్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న వైసీపీ యువనేత గౌతమ్ రామకోటిపురం లో వారి ఇంటి వద్దకు వెళ్లి వేణు మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. మాజీ నీటి సంఘం అధ్యక్షులు గొర్రె బసవరావ్ అద్దంకి శేషు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బడే గౌతం



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక ఎఎఎన్ఎమ్ వివిఆర్ఎస్ఆర్. (ఇం.మీ) హైస్కూల్లో ఆదివారం స్నేహితుల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఎ.ఎ.ఎన్.ఎమ్ పూర్వ విద్యార్థి,నిప్రస్తుత ఐసిఐసిఐ బ్యాంక్ డిప్యూటి మేనేజర్ గా హైదరాబాద్ లో విధులు నిర్వహిస్తున్న, బూబత్తిన సాయిధనూష ముఖ్య అతిథిగా విచ్చేసి, విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్ లో ఉన్నత శిఖరాలను అవరోధించాలంటే కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. 2017- 18 బ్యాచ్ పూర్వ విద్యార్థులు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వివిధ రకాల ఆటలపోటీలు నిర్వహించి విజేతలైన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. పూర్వ విద్యార్థులు అయిన దేవి యశశ్రీ, దిగ్విషాలు తమ శాస్త్రీయ నత్యాలతో అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వి.ఎ.కుంజుమన్, వైస్ ప్రిన్సిపాల్ జి.యమ్. సత్యబాబు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

'చలో విజయవాడ' గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఘంటసాల : ఈ నెల 7వ తారీఖున విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఘంటసాల మండలం శ్రీకాకుళం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద చలో విజయవాడ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో



సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మహమ్మద్ కరిముల్లా, షిఫ్ట్ ఆపరేటర్ పుట్టి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టి రామారావు విగ్రహానికి భూమిపూజ

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక´రామారావు విగ్రహ ఏర్పాటు చేయటానికి భూమిపూజను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ బోడే ప్రసాద్ తనయుడు బోడే వెంకట్రామ్, తుమ్మలపల్లి హరికష్ణ, తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు ఈడా కోటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి వీరంకి పావనమూర్తి, తెలుగు యువత నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న దృశ్యం

నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కలెక్టరేట్ సమావేశ హాలులో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిసా ్తమని ఇన్చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం కార్యక్రమం జరుగుతుందని, అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చన్నారు.

విఎఫ్‌సిలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని జెఆర్‌సి కాలేజీ రోడ్‌లోని విఎఫ్‌సి దుకాణంలో నాన్ వెజ్, వెజ్ తయారు చేసి ఆసక్తి ప్రియులకు విక్రయాలు చేస్తుంటారు. విద్యుత్ పరికరాలు ద్వారా వేడి చేసి అందుబాటులో ఉంచి వచ్చిన వారికి అనుగు ణంగా అందిస్తారు. విద్యుత్ పరికరాలు ఒత్తిడికి లోనై ఆదివారం షాపులో మంటలు వ్యాపిం చాయి.



మంటలు వ్యాపించడంతో షాప్ నిర్వాహకులు బయటకు పరుగులు తీశారు. సమాచారాన్ని అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, విద్యుత్ శాఖ సిబ్బంది సరఫరాను నిలిపివేసి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసి ప్రమాద నియంత్రణ చర్యలు తీసుకోన్నారు. ప్రమాదం కారణంగా జరిగిన నష్టం సుమారు 3 లక్షలు ఉండవచ్చని సమాచారం.



ఉచిత వైద్య శిబిరం


ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం అంబారుపేట గ్రామంలో ఉన్న శ్రీ సత్యమ్మ అమ్మవారి దేవస్థానం ఆవరణంలో గ్రామ పెద్దలు చుండు, వాసు మంచాల మాధవరావు, కంసాని మణికంఠ ఆధ్వర్యంలో నందిగామ సంజీవని హాస్పిటల్ డాక్టర్ బొగ్గవరపు దివ్యచే ఉచిత మెగా మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. మెడికల్ క్యాంపుని మాజీ మంత్రి వసంత నాగేశ్వరావు ప్రారంభించారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు, యాత్రికులు విరివిగా సద్వినియోగం చేసుకున్నారు.



వీధిలైట్లు వేయండి మహాప్రభో

అంధకారంలోనే చెవుటూరు బాపూజీ కాలనీ

ప్రజాశక్తి - జి.కొండూరు : మండలంలోని చెవుటూరు గ్రామం బాపూజీ కాలనీలో గత రెండు నెలల నుండి వీధి లైట్లు వెలగడం లేదు. రాత్రి అయితే చిమ్మ చీకట్లో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపిల్లలు వృద్ధులు, మహిళలు అవస్థలు వర్ణనాతీతం. ఎన్నిసార్లు అధికారులు నాయకులు దృష్టికి



తీసుకువెళ్లిన సమస్య పరిష్కారం అవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి అయితే రోడ్లపై విశ్వసర్పాలు పురుగులు సంచరిస్తున్నాయని బయటికి వెళ్లాలంటే భయంగా ఉందంటున్నారు. వీటితో పాటు డ్రైనేజీల వ్యవస్థలు కూడా సరిగా లేవని డ్రైనేజీలో ఉండే కప్పలను తినడానికి పాములు రాత్రి వేళలో బయటికి వస్తున్నాయంటున్నారు. దోమలు కూడా విపరీతంగా ఉంటూ సమస్యల వలయంగా కాలనీ ఉందన్నారు. ఓట్లు కోసం వచ్చిన నాయకులు కనీసం కాలనీ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని మండిపడుతున్నారు. దయచేసి ఉన్నతాధికారులు సమస్యను పరిష్కరించాలంటూ కోరుతున్నారు.

సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శన

ప్రజాశక్తి - విజయవాడ : శ్రీ విజయ కనక దుర్గా కళా నాట్య మండలి వారు బొత్స సూర్య నారాయణ సౌజన్యంతో పౌరాణిక నాటకం రాజా సత్యహరిశ్చంద్ర ఆదివారం రాత్రి స్థానిక గ్రంథాలయంలో ప్రదర్శించారు. హరిశ్చంద్ర పాత్రలో జి.వెంకటేశ్వర్లు, గొడ్డళ్ళ వెంకటేశ్వరరావు, సతీష్ పాల్, చంద్రమతి పాత్రలో వీరమణి, నక్షత్రకుడిగా ఎస్‌కె బుజ్జి సాహెబ్, కె వెంకయ్య, కాలకౌశికుడిగా దర్శి శ్రీనివాస్, లోహితాసుడిగా చింతా ప్రణవ సాయి రాణించారు. ట్రూప్ ఆర్గనైజర్ అగురు త్రినాథ్ నాయుడు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రముఖ పౌరాణిక నటులు గుమ్మడి జీవనకుమార్ క్రైస్తవ కళా నాట్య మండలి ఆర్గనైజర్ మోట్రు అంటోని మోడి ఆంజనేయులు, జి.అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు. ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



నాటక ప్రదర్శనలో కళాకారులు

స్మార్ట్ మీటర్లు ఇళ్ళకు బిగించొద్దు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో 8, 9 వార్డుల్లో రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్మార్ట్ మీటర్లు ఉద్యమం తీవ్ర రూపం దాల్చడంతో ఆగస్టు 5 న స్మార్ట్ మీటర్లు బిగించొద్దు, కరెంట్ ఛార్జీలు తగ్గించాలని ఆందోళనకు పిలుపు ఇచ్చిన నేపథ్యంలో కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో 8, 9 వార్డుల్లో ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ డోర్ స్టిక్కర్లు అంటించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం కొండపల్లి మున్సిపల్ టౌన్ కమిటీ సభ్యులు ఎస్‌కె భాష మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి టౌన్ కమిటీ సభ్యులు లింగాల పార్వతి, కానుకుర్తి బేబీ, బాడిశ వెంకటేశ్వరావు, డివైఎఫ్ఐ సభ్యులు షేక్ జమీర్, స్థానిక మహిళలు బాజీబి, పద్మ, ఎస్‌కె భాష, మస్తాన్ బి, రజిని, మౌనిక, నాగుల్ బి.రాజేశ్వరి పాల్గొన్నారు. **విస్సన్నపేట :** పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలనీ స్మార్ట్ మీటర్లను తొలగించాలని కోరుతూ సిపిఎం విస్సన్నపేట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కరపత్రాలు పంపిణీ చేయడం జరిగింది. ప్రజాభిప్రాయాల కోసం స్మార్ట్ మీటర్లకు



వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేస్తూ ఆగస్టు 5న రాష్ట్రవ్యాప్త ఆందోళన పిలుపునిచ్చారు. కావున ప్రజలు ప్రభుత్వాలు ప్రజలపై 15,485 కోట్లు భారం మోపుతూ నిర్ణయం తీసుకుంది. ప్రజలపై భారం మోపవద్దని తెలుపుతూ ఆందోళనలో ప్రజల భాగస్వామి కావాలని సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విసన్నపేట పట్టణ కార్యదర్శి మేకల జ్ఞాన రత్నం సిపిఎం నాయకులు కరెడ్ల ధనలక్ష్మి కోలేటి రమేష్ వినుకొండ శ్రీనివాసరావు రాము, శీను పాల్గొన్నారు.

తల్లి అంగన్వాడీ టీచర్ - కూతురు కానిస్టేబుల్

ప్రజాశక్తి - వత్సవాయి : మండల కేంద్రమైన వత్సవాయిలో అంగన్వాడీగా పనిచేస్తున్న బండారు అరుణ కూతురు సివిల్ కానిస్టేబుల్‌గా నియామకమైంది. బండారు ఝాన్సీ కానిస్టేబుల్‌గా ఎంపికవ్వాలనే లక్ష్యంతో పట్టుదలతో సాధించినట్లు బండారు ఝాన్సీ తెలిపారు. ఆమె డిగ్రీ వరకు



చదువుకొని ఉపాధ్యాయ వృత్తిలో నిలబడాలనే లక్ష్యంతో టిటిసి కూడా పూర్తి చేశారు. అయినా సివిల్ ప్రిపేర్ అవుతూ ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సివిల్స్ ప్రిపేర్ అయినట్లు ఆమె తెలిపారు 200 మార్కుల్లో వంద మార్కులు సాధించినట్లు ఆమె తెలిపారు. తల్లి అంగన్వాడీ టీచర్‌గా పనిచేస్తూ తన పిల్లల భవిష్యత్తు కోసం నిత్యం శ్రమించినట్లు తెలిపారు. ఒంటరి జీవితంతో పిల్లల్ని సమాజంలో ఒక గుర్తింపు తేవాలని లక్ష్యంతో ఎంచుకున్నట్లు పేర్కొన్నారు. దీంతో పలువురు గ్రామ పెద్దలు, నాయకులు, బంధువులు ఆమెను అభినందించారు.

కానిస్టేబుల్ ఉద్యోగాలు పొందిన గ్రంథాలయ విద్యార్థులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట,

కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ గ్రేడ్ 1 శాఖ గ్రంథాలయం జగ్గయ్యపేటలో రెగ్యులర్‌గా చదువుకుంటూ ఎం.గోపి, ఎం.నదియా, బి.గోపి, డి.చందు, పి.చంద్ర శేఖర్ ఏపీ ఎస్పీ (పోలీస్) నోటిఫి కేషన్‌లో ఎగ్జామ్ రాసి కానిస్టేబుల్‌గా సెలెక్ట్ అయ్యారు. ఉద్యోగాలు సాధించిన వీరికి గ్రంథాలయ సంస్థ తరపున గ్రంథాలయ అధికారి ఆలేటి ప్రభ అభినందనలు తెలిపారు. గ్రంథాలయాన్ని అందరూ సద్వినియోగం చేసు కోవాలని ఆమె సూచించారు.

విరాళం

ప్రజాశక్తి - వత్సవాయి : గోవుల సంరక్షణకు విరాళం, మండల కేంద్రమైన పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసియున్న అమ్మవారి ఆలయ గోశాలలో గోవుల సంరక్షణకు మండలంలోని కొనకంచి గ్రామానికి చెందిన దేవరపల్లి నారపరెడ్డి విజయ కుమారి 18,500 విరాళంగా ధర్మకర్త బెజవాడ శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. ఆలయ అధికారులు దాతలను శేష వస్త్రాలతో ప్రసాదాలతో సత్కరించారు.

కళాకారులంతా ఐక్యంగా ఉండాలి

ప్రజాశక్తి - గంపలగూడెం : మండల కళాకారుల సమావేశం ఆదివారం సాయంత్రం సీనియర్ కళాకారుడు సాంబార్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన మేడూరు గ్రామంలో ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు జి.వి.రంగారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ కళాకారులు తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలన్నారు. వారికి ప్రజానాట్యమండలి బాసటగా నిలుస్తుందన్నారు. కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు, ప్రదర్శనల బకాయిలు వంటి అంశాలపై సమష్టిగా అధికారుల్ని కలుద్దామన్నారు. సమావేశంలో ప్రజానాట్యమండలి జిల్లా సహాయ కార్యదర్శి పంబి వెంకటేశ్వరరావు, కెవిపిఎస్ నాయకులు కుటుంబరావు, సామాజిక కార్యకర్త బి.జె.సుందరరావు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవం

అనుమోలు నాగలక్ష్మి అధ్యక్షురాలుగా, స్వర్ణ చంద్రకళ కార్యదర్శిగా ఏడుగురితో ప్రజానాట్యమండలి కమిటీ ఏకగ్రీవంగా ఏకగ్రీవమైంది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పలు కళారూపాల వారు పాల్గొన్నారు.



దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ కుటుంబ సమేతంగా దుర్గమ్మను దర్శించుకున్నారు. కేశినేని శివనాథ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఇఒ వి.కె.శీనా నాయక్, కేశినేని శివనాథ్ కుటుంబ సభ్యులకు ఘన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆశీర్వచన మండపంలో పండితులు శివనాథ్ కుటుంబ సభ్యులకు ఆశీస్సులు అందజేశారు. ఇఒ శీనా నాయక్, శివనాథ్ దంపతులకు అమ్మవారి చిత్రపటం, శేష వస్త్రం, తీర్థప్రసాదాలను బహుకరించారు. **జగ్గయ్యపేట :** విజయవాడ ఇంద్రకీలాద్రి పర్వతంపై అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన శ్రీ కనకదుర్గమ్మ తల్లిను శనివారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య దర్శించుకున్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానానికి విచ్చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్‌కు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు.

ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 42.8174 టిఎంసిల నీళ్ల ఉన్నాయి. ఎగువనున్న నాగార్జునసాగర్ నుండి ఇన్ ఫ్లో 1,33,393 క్యూసెక్కుల నీళ్ల వస్తుండగా, అవుట్ ఫ్లో 1,60,448 క్యూసెక్కులు నీళ్లను ఆరు గేట్లు ఎత్తి అధికారులు బయటికి పంపిస్తున్నారు.

పవిత్ర సంగమంలో యువకుని మృతదేహం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం ఫెర్రీ ఘాట్ పవిత్ర సంగమం శనివారం సాయంత్రం మిస్సయిన కలకంటి నవీన్ (17) మృతదేహం ఆదివారం మధ్యాహ్నం లభ్యమైంది. ఎక్కడైతే కనిపించకుండా పోయాడో అక్కడే మృతదేహం పోలీసులు ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది కనుగొన్నారు. కుమారుడు మృతదేహం చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అధికారుల నిర్లక్ష్యం వల్లనే తమ కుమారుడు చనిపోయాడని నవీన్ తల్లి గుండెలవిసేలా విలపిస్తున్నారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది ఉదయం 6 గంటల నుండి ఇక్కడే ఉన్నా పడవకు పెట్రోల్ లేదంటూ కాలయాపన చేశారని, చివరకు పెట్రోల్ తెప్పించిన తరువాత నదిలోకి దిగారని ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం వల్లనే తమ కుమారుణ్ణి కోల్పోయామని ఆరోపిస్తున్నారు.

శ్రీవాహినిలో జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు శ్రీవాహిని ఇంజనీరింగ్ కళాశాలలో నీట్ పిజి 2025 పరీక్షను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జా మినేషన్ మెడికల్ సైన్స్ వారు ఆదివారం నిర్వ హించారు. ఈ పరీక్షకు దక్షిణ భారతదేశంలోని వివిధ రాష్ట్రాల నుండి 150 మంది విద్యార్థులను కేటాయించగా 117 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపల్, పరీక్ష పరీక్షా కేంద్రం ప్రధానాధికారి డాక్టర్ రంగా నాగేంద్రబాబు తెలిపారు. ఈ పరీక్షకు పరిశీలకులుగా నియమితులైన మచిలీపట్నంకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఇ.గౌరీ పరీక్షా నిర్వహణ, భద్రత, శుభ్రత, వివిధ నిబంధనలకు అనుగుణంగా ప్రశాంతంగా జరిగేలా పర్యవేక్షించారు. పరీక్షను ప్రశాంతంగా పారదర్శకంగా నిర్వహించడంలో సహకరించిన అధికారులకు, కళాశాల యాజమాన్యంకు, సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు.

విద్యా రంగాన్ని పరిరక్షించుకుంటేనే సమాజాభివృద్ధి

- మాజీ ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, బొడ్డు నాగేశ్వరరావు



మాట్లాడుతున్న కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించుకుంటెనే సమాజం అభివృద్ధి చెందుతుందని పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీలు కె ఎస్ లక్ష్మణరావు, బొడ్డు నాగేశ్వరావులు సూచించారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కష్ణాజిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం ఆదివారం స్తానిక యుటిఎఫ్ జిల్లా శాఖ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన మాజీ ఎంఎల్సి కె ఎస్ లక్ష్మణరావు మాట్లా డుతూ ప్రస్తుతం విద్యారంగంలో దార్శనికత కొరవడిందన్నారు. కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు సమగ్ర శిక్ష పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసి బలమైన విద్యావ్యవస్థ నిర్మించాయని, కానీ ఆంధ్ర రాష్ట్రంలో మాత్రం ఇందుకు విరుద్ధంగా తక్కువ సంఖ్యలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో నడుస్తున్న పాఠశాలలు పెరిగాయన్నారు. సమగ్ర శిక్ష పేరుతో విద్యాశాఖకు సమాంతరంగా వ్యవస్థను కూటమి ప్రభుత్వ విధానాలు పాఠశాల విద్యను నిర్వీర్యం చేస్తున్నాయన్నారు.

ఇటీవల ప్రవేశపెట్టిన తొమ్మిది రకాల పాఠశాలల విధానాన్ని రద్దు చేసి, ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. వెనుకబడిన ప్రాంతాల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. ప్రభుత్వాన్ని అధికారంలోకి రాగానే ఉపాధ్యాయ యాప్‌లను రద్దు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం కొత్తగా 14 అంశాలతో కూడిన యాప్‌లు తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంలో అశాస్త్రీయ పద్ధతులు అవలంభిస్తున్నారన్నారు. దీంతో రాష్ట్రంలోని 34 వేల ప్రభుత్వ పాఠశాలలో 10 వేల పాఠశాలలు మూతపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి విముక్తి చేయాలని డిమాండ్ చేశారు. బొడ్డు నాగేశ్వరావు మాట్లాడుతూ అలాగే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రభుత్వం బకాయి ఉన్న రూ 22 వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని, 12వ వేతన సంఘాన్ని నియమించాలని, డీఏలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. యు టి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కెఏ ఉమమహేశ్వరావులు ప్రసంగించిన ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.డి. షౌకత్ హుస్సేన్ అధ్యక్షత వహించగా జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కనక రావు మధ్యంతర నివేదిక ప్రవేశ పెట్టారు.తొలుత యు టి ఎఫ్ నాయకులు మాజీ పి. రాందేవ్ జాతీయ పతాకాన్ని, ఎస్. పార్వతీశం ఎస్టీఎఫ్ఐ పతాకాన్ని, ఎం. ఆరోగ్య స్వామి యూటీఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సమావేశంలో కోశాధికారి ఎమ్. వరప్రసాద్, కార్యదర్శి టి. సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు. జిల్లా నేతలు జె. లెనిన్ బాబు, సి.హెచ్. రాజా శ్రీధర్, జె.ఝాన్సీ, నీలం ప్రభాకరరావు, యూటీఎఫ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ బోడే ప్రసాద్

ప్రజాశక్తి-కంకిపాడు : పెనమలూరు నియోజకవర్గం కంకిపాడు మండలం కాసరనేని వారిపాలెం గ్రామపం చాయతీ నూతన భవన నిర్మాణానికి శంకు స్థాపనను ఆదివారం ఎంఎల్ఎ బోడేప్రసాద్ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో ఎన్నో అభివద్ధి కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. ఈ కాసారనేనివారి పాలెం పంచాయతీ భవనం తొందరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎయిర్పోర్ట్ అథారిటీ మెంబర్ ముప్పా రాజా, కంకిపాడు ఎంపీటీవో పి అనూష, సర్పంచ్ పి వరప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

592 మందికి వైద్య పరీక్షలు



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు పల్లెల్లో పేద ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్య సేవలను అందిస్తున్నారు. ఆదివారం జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన 592 మందికి గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రోఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలతో బాధ పడుతున్న రోగులకు డాక్టర్ సి.ఎల్ వెంకటరావు, నేత్ర సమస్యలకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్లు హనుమకొండ దుర్గ భవాని, కణితి శశిరేఖ, గుండె, ఊపిరితిత్తుల సమస్యలకు విజయవాడ కామినేని హాస్పిటల్ వైద్యులు డాక్టర్ భవాని, ఎస్.దాశరథి తమ వైద్య సేవలను రోగులకు అందించారు. అనంతరం అవసరమైన రోగులకు డాక్టర్ సి ఎల్ వెంకటరావు చేతుల మీదుగా ఉచిత మందులను పంపిణీ చేశారు.

వినియోగదారులను ఇబ్బందులు పెడితే చర్యలు

- కృష్ణాజిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి జి.మోహన్‌బాబు



ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో రేషన్ డీలర్లు , గ్యాస్ ఏజెన్సీలు, పెట్రోల్ బంకుల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు ప్రకారం పని చేయాలని అలాకాకుండా వినియోగ దారులను ఇబ్బందులకు గురి చేస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని కృష్ణా జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి జి.మోహన్ బాబు స్పష్టం చేశారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించడంతో పాటు వినియోగ దారులకు మెరుగైన సేవలు అందించేలా ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళుతున్నామని తెలిపారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని బియ్యం కార్డులు ఉన్నాయి

జవాబు : కృష్ణా జిల్లాలో ప్రస్తుతం 5,22,589 తెల్ల కార్డులు ఉన్నాయి.

ప్రశ్న : ప్రతి నెల కార్డు దారులందరూ నిత్యావసరాలు తీసుకుంటున్నారు.?

జవాబు : 99 శాతం మంది వినియోగదారులు తీసుకుంటున్నారు.

ప్రశ్న : వినియోగ దారులు తీసుకుంటున్నారా లేక దారి మళ్ళుతున్నాయా..?

జవాబు : అలాంటివి ఏమి లేవు. ఒక వేళ అలాంటి సంఘటనలు ఏమైనా జరుగుతుంటే వెంటనే అధికారులు దృష్టికి తీసుకురావాలన్నారు.

ప్రశ్న : జిల్లాలో ఇప్పటి వరకు బియ్యం అక్రమ రవాణా, అక్రమ నిల్వలు వంటివి ఏమైనా గుర్తించారా.వాటి పై కేసులు నమోదు చేసారా?

జవాబు : జిల్లాలో బియ్యం అక్రమ రవాణాపై 13 కేసులు, అలాగే రేషన్ షాపుల పై 26 కేసులు నమోదు చేశాం.



ప్రశ్న : జిల్లాలో ఎంత మంది కొత్త కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు.

జవాబు : 6079 మంది దరఖాస్తులు చేసుకోగా, మరో 6100 మంది కార్డులో చేర్పులు మార్పుల కొరకు దరఖాస్తు చేసుకున్నారు.

ప్రశ్న : కొత్త వారికి కార్డులు ఎప్పుడూ పంపిణీ చేస్తారు.

జవాబు : ఆగస్టు 15 నుండి స్మార్ట్ రేషన్ కార్డుల పేరుతో పంపిణీ చేయనున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. వాటితో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి పంపిణీ చేస్తాం.

ప్రశ్న : దీపం-2 పథకం కింద జిల్లాలో ఇప్పటి ఎన్ని ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చారు.

జవాబు : 3 ,35, 395 సిలిండర్లు వినియోగదారులకు అందించాం.

ప్రశ్న : చాలా మంది వినియోగదారులకు గ్యాస్ డబ్బులు పడటం లేదని చెబుతున్నారు.. ఇది నిజమేనా ?.

జవాబు : మొదట్లో కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తడంతో మీరన్న మాట వాస్తవమేగాని ప్రస్తుతం అలా ఏమి లేదు. సంవత్సరానికి మూడు సిలిండర్లు చొప్పున ఇస్తాం. ఇది కూడా నాలుగు నెలలకొకసారి అలా బుక్ చేసుకున్న వారందరికీ సబ్సిడీ వారి బ్యాంక్ ఖాతాలో జమ అవుతుంది. అలా కాకుండా ఇంకా ఎవరికైనా సబ్సిడీ నగదు జమ కాక పోతే వారి దగ్గర్లో గ్యాస్ ఏజెన్సీల వారిని గాని సంబధిత తహసిల్దార్ కార్యాలయంలో గానీ సంప్రదించి సమస్య పరిష్కరించుకోవాలి.

ప్రశ్న : గ్యాస్ ఏజెన్సీలు డెలివరీ ఛార్జీల పేరుతో వినియోగ దారుల వద్ద నుండి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. వీటిపై ఏమైనా పిర్యాదులు అందాయా..?అందితే ఎన్ని గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు తీసుకున్నారు.

జవాబు : పిర్యాదులు ఏమి రాలేదు. అయినా వినియోగ దారులు ఎవరు అదనంగా ఏమి చెల్లించనక్కర్లేదు. ఒకవేళ ఎవరైనా అదనంగా డబ్బులు చెల్లించాలని అడిగితే రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ నిర్వహించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : చివరిగా వినియోగదారులకు మీరిచ్చే సూచనలు ఏమైనా ఉన్నాయా.

జవాబు : ప్రతి వినియోగదారుడు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి. తద్వారా వారికి ఎక్కడైనా నష్టం జరుగుతున్నప్పుడు ప్రశ్నించడానికి వారికి హక్కు ఉంటుంది. ఆవిధంగా వినియోగ దారులు చైతన్యవంతంగా ఉండాలి. .అలాగే రేషన్ డీలర్లు గానీ గ్యాస్ ఏజెన్సీలు గానీ, అదనంగా వసూలు చేసిన, అక్రమాలకు పాల్పడిన ,వినియోగ దారులను ఇబ్బంది పెట్టిన చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

మండలి శత జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, కీర్తిశేషులు మండల వెంకటకష్ణారావు శతజయంతి వేడుకలకు అవనిగడ్డలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు గాంధీ క్షేత్రంలో ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు కొల్లు రవీంద్ర, మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, జిల్లాలోని ఎమ్మెల్యేలు దేశ విదేశాలకు చెందిన ప్రముఖులు హాజరుకానున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు రక్తదాన శిబిరం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అదేవిధంగా గ్రామ గ్రామాన వెంకట కష్ణారావు జయంతి వేడుకలకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు.

కంకిపాడు తెలుగు యువత ప్రధాన కార్యదర్శిగా భార్గవ్‌రామ్



ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శిగా నియమితులైన యలమంచిలి భార్గవ రామ్‌ను కంకి పాడు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చిట్టూరి నాగేశ్వరావు కలిసి అభినందనలు తెలిపారు.. యువ కులు రాజకీయాల్లోకి రావాలని ప్రజలకు సేవ అవకాశం చిన్న వయసులోనే వచ్చిందని దానిని సద్వినియోగ పరుచుకోవాలని ఈ సందర్భంగా నాగేశ్వరరావు అన్నారు. అలాగే నియోజకవర్గం లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు భార్గవ్ రామ్ ను అభినందించారు.



కొండలమ్మకు వెండి కిరీటం బహూకరణ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వేమవరంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారికి కాకినాడకు చెందిన పిల్లి శ్రీనివాస రావు, సంధ్య, చి.విహిత లు సుమారు 1లక్షా 40 వేల విలువగల వెండి కిరీటాన్ని ఆదివారం బహూకరించారు. వారిని ఆలయ మర్యాదలతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అర్చకులు అందజేశారు. అలాగే శ్రావణమాసం సందర్భంగా భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. సుమారు 20 వేలమంది పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అత్యధిక స్థాయిలో భక్తులు శ్రీ అమ్మవారికి పాలపొంగళ్ళు సమర్పించి, వారి మొక్కుబడులు తీర్చుకున్నారు. దేవస్థానమునకు విచ్చేసిన భక్తులకు తాగు నీరు, శానిటేషన్ ఏర్పాట్లు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా దర్శనం చేసుకునేలా దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు పర్యవేక్షించారు.. భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు.

15వ తేదీ శ్రావణ మాసం 3వ శుక్రవారం సందర్భంగా శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో మహిళామణులచే సామూహిక వరలక్ష్మి వ్రతాలు జరుగుతాయనిఇఓ తెలిపారు. వ్రతములో పాల్గొనే మహిళా భక్తులు ముందుగా 516 రూపాయలు చెల్లించి రశీదు తీసుకుని పేరు నమోదు చేసుకోవాలన్నారు.



ఆదివారం ఆలయం వద్ద భక్తులు

7న చలో విజయవాడను జయప్రదం చేయండి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంసి హెచ్.శ్రీనివాస్

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : విద్యుత్ కాంటాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 7వ తేదీ విజయవాడలో నిర్వహించ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎన్‌సి. హెచ్.శ్రీనివాస్ కోరారు. పట్టణంలోని డిపో సమీపంలో గల 33 కెవి విద్యుత్ సబ్ స్టేషన్, చిల్లకల్లులో గల 220 కె.వి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గోడ ప్రజలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫ్యాన్సీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీ విజయవాడ విద్యుత్ సౌదా వద్ద ఉదయం 10:30కు విద్యుత్ కాంట్రాక్టర్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చలో విజయవాడ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌరవ అధ్యక్షులు పి.అనీల్ కుమార్, రీజినల్ కార్యదర్శి, నాయకులు షేక్ గౌస్, గుత్తికొండ లక్ష్మణ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

విద్యా స్వేచ్ఛను హరించే ఉత్తర్వులు రద్దు చేయాలి

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యా మండలి ఆగస్టు 1న జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం తల్లిదండ్రులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు మినహాయిస్తే ఇతర వ్యక్తులు, సంస్థలు పాఠశాల ప్రాంగణంలోకి ప్రవేశించడం, తరగతి గదుల్లోకి వెళ్లడం, విద్యార్థులతో సంభాషించడం నిషేధించబడినట్లు పిడిఎస్‌ఒ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. సురేష్ తెలిపారు. ఆదివారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఈ ఉత్తర్వులు విద్యార్థులు, ఉపాధ్యాయుల స్వేచ్ఛను, ప్రజాస్వామ్య హక్కులను హరించి, పాఠశాలలను జైళ్లుగా మార్చేలా ఉన్నాయన్నారు. విద్యార్థి సంఘాలను నియంత్రించడం, వాటి గొంతును అణచివేయడం లక్ష్యంగా పెట్టుకున్నాయని విమర్శించారు. ఈ ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా విద్యార్థి సంఘాలపై నిషేధం విధించే ప్రయత్నాలు జరిగాయని, 2002లో చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు టిడిపి అనుబంధ విద్యార్థి సంఘం తెలుగు విద్యార్థి పరిషత్‌ను రద్దు చేశారన్నారు. అయితే 2004లో ప్రతిపక్షంలోకి వచ్చిన వెంటనే తెలుగు నాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ (టీఎన్‌ఎస్‌ఎఫ్)ను ప్రారంభించారు. ఇప్పుడు మళ్లీ "రాజకీయ పార్టీలకు ప్రవేశం లేదు" అనే పేరుతో విద్యార్థి సంఘాలను నియంత్రించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల స్వేచ్ఛను, పాఠశాలల భవిష్యత్తును, కాలరాసే ఈ నిరంకుశ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించు కోవాలని పిడిఎస్‌ఓ డిమాండ్ చేస్తోంది. ఈ ఉత్తర్వుల రద్దుకై విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాస్వామిక శక్తులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

ఠాగూర్ గ్రంథాలయంలో 100 మంది విద్యార్థులకు శాశ్వత సభ్యత్వం

విజయవాడ : గవర్నర్ పేట, విజయవాడలో గల ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో కాకాని వెంకటరత్నం 125వ జయంతి సందర్భంగా వారి మనవడు కాకాని తరుణ్ ఠాగూర్ గ్రంథాలయానికి ఎపిఎస్‌ఆర్‌ఎమ్ పాఠశాలలోని 100 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.50 చొప్పున శాశ్వత సభ్యత్వం బహూకరించారు. ఆయన మాట్లాడుతూ విద్యతో పేద విద్యార్థులకు ఎంతో సేవ చేయొచ్చని ఆ విధంగా, నలుగురికి సహాయం చేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులందరూ ఉన్నత స్థాయికి చేరటానికి గ్రంథాలయ సంస్థ, సిబ్బంది ఎంతో కృషి చేస్తున్నారన్నారు. తరుణ్‌కు గ్రంథాలయాధికారి కె.రమాదేవి ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లి చదువుకుని మరలా తీసుకొచ్చే అవకాశం కల్పించారు.



నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : లయన్స్ క్లబ్ ఆఫ్ జగ్గయ్యపేట నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం లయన్స్ కమ్యూనిటీ హాల్లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, ఇన్స్టాలేషన్ అధికారిగా లయన్ మిరియాల వెంకటేశ్వరరావు సభ్యులచే ప్రమాణ స్వీకారం చేపిస్తూ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రపంచవ్యాప్తంగా 207 దేశాల్లో సేవాపరంగా విస్తరించి అభాగ్యులైన ఎంతోమంది పేదవారికి సహాయ సహకారాలు అందిస్తూ విశేష సేవలందుతాయని తెలిపారు. మొదట ఉప గవర్నర్ లయన్ సిహెచ్.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 2025 - 26 లయన్స్ స్టిక్ సంవత్సరంలో 365 రోజుల మహాఅన్నదానం చేపట్టినట్టు, ఉచిత కంటి పరీక్షలు, లక్ష మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. 2025-26 సంవత్సరం నూతనంగా అధ్యక్షులుగా లయన్ శ్రీరామ్ బదిరీ నారాయణ, కార్యదర్శిగా లయన్ షేక్ ఖాసిం సైదా, కోశాధికారిగా లయన్ బండారూ రవికుమార్ ప్రమాణస్వీకారం చేసినట్టుగా తెలిపారు. ఈ సంవత్సరం ఏడుగురు నూతన సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేసినారు. ఈ కార్యక్రమంలో జి. యల్. టి కో చైర్మన్ లయన్ గాంధీ, జిఎస్టి కోఆర్డినేటర్ లయన్ కె ముత్యం ప్రసాద్, అధ్యక్షులు లయన్ బదిరీ నారాయణ, కార్యదర్శి లయన్ ఖాసిం సైదా, కోశాధికారి లయన్ రవికుమార్, లయన్ కె కరుణాకర్ రావు, లయన్ కె అమర్నాథ్, లయన్ డాక్టర్ ఎస్ రాజ కేశవ ప్రసాద్ పాల్గొన్నారు.

వ్యాపారస్తులపై కూటమి ధోరణి మారాలి : వెలంపల్లి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : పశ్చిమ నియోజకవర్గం వన్‌టౌన్‌లోని 37వ డివిజన్, కోటం రాజు వారి వీధిలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ మండెపూడి ఛటర్జీ కార్యాలయంలో అదివారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ 37వ డివిజన్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పశ్చిమ వైసిపి ఇన్చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇంచార్జ్ బోండా నిరీష్, పలు వ్యాపారస్తులు, ఆయా డివిజన్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. బాబు మోసాలను, ప్రజలకు ఇచ్చిన బాండ్లు, వైయస్ జగన్ ప్రెస్‌మీట్‌ని టివిలో చూపించారు. ఇంటింటికి క్యూ ఆర్ కోడ్ తో వెళ్లి ప్రజలతో ఆ క్యూ ఆర్ కోడ్ ని స్కాన్ చేపించి కూటమి మోసాలను వివరించాలని కోరుతూ క్యూ ఆర్ కోడ్ ని ఆవిష్కరించారు.

కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: భగవాన్ శ్రీ సత్యసాయి 100వ జన్మదినోత్సవం సందర్భంగా ప్రతినెల పట్టణంలో కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 50 మందికి శుక్లాల ఆపరేషన్ చేయాలని నిర్ధారించారు. గత నెలలో 135 మంది ఆపరేషన్ చేయించుకున్న వారిలో 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శంకర్ కంటి ఆసుపత్రి డాక్టర్ లు, తొమ్మిది మంది మహిళా సేవాదళ్ , ఆరుగురు పురుషుల సేవాదళ్ పాల్గొన్నారు.



చెడునడతకు దూరంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి - నందిగామ : ప్రమాణ పూర్తిగా ఇకపై వివాదాలకు గొడవలకు దూరంగా ఉండాలని నందిగామ సిఐ వైవిఎల్ నాయుడు పేర్కొన్నారు. నందిగామలో ఆదివారం వివాదాస్పద వ్యక్తులకు, గత కేసుల నేపథ్యంలో సమస్యాత్మక వివాదాల్లో చర్యల్లో పాల్గొన్న వ్యక్తులకు నందిగామ సిఐ వైవిఎల్ నాయుడు కౌన్సెలింగ్ ఇచ్చారు. నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలో చెడు నడత కలిగి, వివిధ కేసుల్లో ఎదుటివారిపై ఇబ్బందులకు గురిచేస్తూ ఉన్న వారందరికీ ఆదివారం పోలీసులు కౌన్సెలింగ్ చేశారు. ఈ క్రమంలో వారందరూ కూడా ఇకపై ఎటువంటి వివాదాలకు పోకుండా మంచిగా ఉంటామని ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా నందిగామ పోలీసులు మాట్లాడుతూ నందిగామ టౌన్, మండల పరిధిలో అసాంఘిక కార్యక్రమాలకు తావు లేదని అటువంటి చర్యలు చేసే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా నందిగామ టౌన్ సిఐ వైవిఎల్ నాయుడు, ఇతర సిబ్బంది కౌన్సెలింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని బలుసుపాడు, అన్నవరం గ్రామాల్లో శనివారం రాత్రి బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు బూడిద నరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ సమావేశంలో ముఖ్య అతిథిగా జగ్గయ్యపేట నియోజకవర్గ వైసిపి ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో సూపర్ సిక్స్ హామీలు ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యడ్లపల్లి సూరిబాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు శీలం ప్రభాకర్ రావు, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శి మట్ట ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాస్ గౌడ్, జిల్లా యువజన విభాగ కార్యదర్శి పాల్వంచ రమేష్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గాంధేయవాది వెంకట కృష్ణారావు జీవితం ఆదర్శం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : గాంధేయవాది మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు జీవితం యువ తరానికి ఆదర్శప్రాయమని సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్, గాంధీ కింగ్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ప్రసాద్ గొల్లనపల్లి అన్నారు. కృష్ణారావు శత జయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఘనంగా నిర్వహించడం ముదావహమన్నారు. తొలిసారిగా ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించి తెలుగు భాషకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చి పెట్టారని కీర్తించారు. మాజీ మంత్రి మండలి వెంకట కష్ణారావు శతజయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ను సర్వోదయ మండలి అధ్యక్షుడు నరహరిశెట్టి శ్రీహరి కార్యాలయంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో గాంధీ కింగ్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ప్రసాద్ గొల్లనపల్లి, గాందేయవాది, సీనియర్ రాజకీయ నాయకుడు ఆకుల శ్రీనివాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపి జన్మదినం సందర్భంగా అన్నదానం

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ జన్మదినం సందర్భంగా 200 మంది నిరుపేదలకు బిర్యానీ ప్యాకెట్లను పంపిణీ చేశారు. నగరాల దేవస్థానం పాలకమండలి కోశాధికారి పిళ్ళ శ్రీనివాసరావు, రాంపిల్ల శ్రీనివాసరావు, కొరగంజి భాను బాబు. పైలా శ్రీనివాసరావు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట :** విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ జన్మదిన వేడుకలను కేశినేని ఫౌండేషన్స్ ఆధ్వర్యంలో పంచాయతీ ఛాంపియన్స్ పట్టణంలోని వృద్ధాశ్రమంలో ఎంపి కేశినేని శివనాథ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. **విస్సన్నపేట :** ఎంపి జన్మదిన వేడుకలు విసన్నపేట మండల తాతకుంట్ల గ్రామంలో గ్రామ పార్టీ అధ్యక్షులు పులపాక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేశారు.



కళ్లజోళ్లు పంపిణీ

ప్రజాశక్తి - వత్సవాయి : మండలం కేంద్రమైన వత్సవాయిలో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన 309 మంది లబ్ధిదారులకు ఉచిత కళ్లజోళ్లు అందజేశారు. ఈ సేవా కార్యక్రమాన్ని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, రాజకీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ, జయప్రద ఫౌండేషన్ చైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. రోటరీ క్లబ్ ఎలెక్ట్ గవర్నర్ శ్రీరామ్, ఎలెక్ట్ డిస్ట్రిక్ట్ సెక్రెటరీ మధు శంకర్ నేత్రాలయ హాస్పిటల్ %వీణ% డాక్టర్ స్వాతి వత్సవాయి నాయకులు వడ్లమూడి రాంబాబు, పెద్ది రామారావు, ఫౌండేషన్ కోఆర్డినేటర్ కట్ట నరసింహారావు, జొన్నలగడ్డ రాధాకృష్ణమూర్తి తదితరులున్నారు.

ఫ్రెండ్షిప్ డే

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : స్థానిక ఏలూరు రోడ్ లో గల లీల గ్రాండ్ ఫంక్షన్ హాల్ నందు స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఎస్. కే.పి.వి.వి హిందూ హై స్కూల్ 1985-86 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమావేశం మరియు స్నేహితుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలలో పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు గారు పాల్గొని తన చిన్ననాటి స్నేహితులతో కొద్దిసేపు ఆనందంగా గడిపారు అనంతరం కేక్ కట్ చేశారు అనంతరం తన స్నేహితులతో తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆహ్లాదంగా గడిపారు.

గన్నవరం పిహెచ్‌సిలో

మౌలిక సదుపాయాలు నిల్

- వానొస్తే కారిపోతున్న భవనం
- అన్ని రకాల మందులూ అందుబాటులో లేని వైనం



ప్రజాశక్తి-గన్నవరం : చినుకు పడితే గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రం భవనం కారిపోతుంది. స్లాబు పెచ్చులు ఎప్పుడు ఊడతాయో తెలియని పరిస్థితి. మౌలిక వసతులు లేకపోవడంతో ఒక గదిలో ముగ్గురు డాక్టర్లు ఉండి రోగులను పరీక్షించాల్సి వస్తుంది. డెంటల్ డాక్టర్ ఉన్న సదుపాయాలు లేకపోవడంతో వైద్యం అందడం లేదు. దీంతో దంత వైద్యం ప్రశ్నార్థకం అవు తుంది. అన్ని రకాల మందు బిళ్ళలు కూడా అందు బాటులో ఉండడం లేదని రోగులు చెబుతున్నారు. ఓపి బ్లాక్, వైద్యులకు ఐదు గదులు, ఫార్మసీ బ్లాక్ కోసం ఒక భవనం కట్టాల్సి ఉంది. దీనికోసం నిధులు శాంక్షన్ చేయాలని ఐదేళ్లుగా అడుగుతున్నా ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. 40 పడకల ఆసుపత్రి కావడంతో ఆర్థోపెడిక్, గుండె సంబంధిత స్పెషలిస్టులు ఉండడం లేదు. ఆదివారం ఏదైనా ఎమర్జెన్సీ కేసు వస్తే అప్పుడు డాక్టర్ కు ఫోన్ చేస్తే వచ్చే పరిస్థితి. ప్రతిరోజు రాత్రి వేళలో కూడా ఇదే పరిస్థితి.ఈ క్రమంలో సిబ్బంది డాక్టర్లుగా మారి ప్రాథమిక వైద్యం చేస్తున్నారు. సాధాం˘ణమైన రోజుల్లో ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకే డాక్టర్లు ఉంటారు. ఆ తర్వాత చూద్దామన్నా డాక్టర్లు కనిపించరు, రాత్రివేళ ఏదైనా కేసు వస్తే వెంటనే విజయవాడ తీసుకువెళ్లిపోమని సిబ్బంది చెబుతున్నారు. ప్రభుత్వం చిన్న చూపు వల్ల ఈ ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పన జరగడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఆసుపత్రి అభివద్ధికి రూపాయి కూడా కేటాయించలేదు. ఆసుపత్రి బడ్జెట్ ను కూడా వేరే వాటికి తరలించారు. దీనికి తోడు ఈ ఆసుపత్రిలో స్పెషలిస్టులు లేరు. సాధారణ వైద్యులతోనే నడక సాగుతోంది. ఇది 40 పడకల ఆసుపత్రి. నిత్యం జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాల్లో గాయపడిన రోగులను ఇక్కడకు తీసుకువస్తారు. ఆర్థోపెడిక్ డాక్టర్ లేడు. దంత వైద్యులు ఉన్నా లేనట్లే. ఎందుకంటే పరికరాలు లేవు, మందులు లేవు. దీంతో డాక్టర్ ఖాళీగా ఉండాల్సి వస్తుంది. ఆదే విధంగా గన్నవరం మండలంలోని పది గ్రామాల నుంచి వైద్యం కోసం జనం రోజు ఆసుపత్రికి వస్తారు. ఓపి 300 నుంచి 400 వరకు ఉంటుంది. ఆరుగురు డాక్టర్లు ఉన్నారు. అందరూ సాధారణమైన డాక్టర్లే. స్పెషలిస్టులు లేరు. నార్మల్ కాన్పులు చేయడం, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయడం వరకే ఈ ఆసుపత్రి పరిమితమైంది. ఏదైనా ఆపరేషన్ చేయాల్సి వస్తే వెంటనే అంబులెన్స్ లో విజయవాడ పంపేస్తున్నారు. ఆపరేషన్ చేసి బయటకు తీసే డాక్టర్లు ఆ మేరకు పని చేయడం లేదని విమర్శ ఉంది. సీనియర్ నర్సులు ఫ్రీ డెలివరీ చేస్తున్నారు. ఇక సాధారణ రోగుల బాధలు వర్ణాతీతంగా ఉన్నాయి. ఈ ఆసుపత్రిలో డిప్యూటీ సివిల్ సర్జన్, ఆర్థోపెడిక్, సర్జన్ పోస్టులు కావాల్సి ఉంది. వాటిని భర్తీ చేయడానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదు. ఇంకా విచిత్రం ఉంటే ప్రస్తుతం పనిచేస్తున్న డాక్టర్లకు చూడడానికి రూములు కూడా లేని పరిస్థితి ఇక్కడ ఉంది. ఇబ్బందులతో రోగులను చూసి పంపుతున్నారు డాక్టర్లు. మౌలిక వసతుల కల్పన కోసం కొత్త భవన సముదాయాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం తక్షణంగా ఉంది. అందుకోసం కోటి రూపాయలు కావాలని గతంలో ప్రతిపాదించారు. దీనికి తోడు పెద్ద ఎక్సరే మిషన్ ఏర్పాటు చేయాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆసుపత్రిలో స్పెషలిస్టులతోపాటు మౌలిక వస తులు కల్పనకు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

నిధులు కేటాయించాలి : శ్రీదేవి, ఆసుపత్రి ఇన్చార్జి,

ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరాం. మంచినీటి సదుపాయం కోసం మరో బోర్వెల్‌ను నిర్మించాలనీ, కరెంటు సమస్యను పరిష్కరించాలని అధికారులకు తెలిపాం. ఆసుపత్రిలో వైద్యుల కోసం ఐదు గదులు నిర్మాణం చేయాలని చెప్పామని, కొత్తగా భవన సముదాయం కడితేనే అది సాధ్యమవుతుంది. పాత భవనం దెబ్బతిన్న కారణంగా దానిని తీసివేసి కొత్త భవనం కట్టాలి. దీనికి అవసరమైన నిధుల గురించి ఉన్నతాధికారులకు విన్నవించాం.

బందరు రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలి



లిఫ్టు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న ప్రయాణీకులు

ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్నం ఎం.పీ వల్లభనేని బాలసౌరి మచిలీపట్నం రైల్వే స్టేషన్ అభివృద్ధిపై గతంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన బందరులో మాట్లాడుతూ మచిలీపట్నం రైల్వే స్టేషన్‌లో వృద్ధులు, మహిళలు పిల్లలు కోసం లిఫ్ట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి సంవత్సరం దాటుతున్న నేటికీ ఏ విధమైన పని ప్రారంభించకపోవడం శోచనీయమని బాలాజీ అన్నారు. మచిలీపట్నంలో లిఫ్ట మరియు ఎక్స్లేటర్ లేకపోవటం వలన రైల్వే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బాలాజీ అన్నారు. లిఫ్టుల ఏర్పాటుపై రైల్వే ఉన్నత అధికారులతో ఎంపీ చర్చలు జరపాలని బాలాజీ కోరారు. అలాగే విశాఖపట్నం ట్రైన్‌కి వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయని బాలాజీ అన్నారు. విజయవాడ నుండి మచిలీపట్నానికి రైల్వే లైన్లు డబల్ లైన్ వేసిన విశాఖపట్నం ట్రైన్ ను గుడివాడలో గంట వరకు ప్రతిరోజు నిలిపివేయటం రైల్వే అధికారులు పూర్తి నిర్లక్ష్యం అని దానిపై ఎంపీ స్పందించాలని బాలాజీ డిమాండ్ చేశారు.

యూనిఫాం కుట్టుటకు కొటేషన్‌లు ఆహ్వానం

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లాలో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెట్రిక్ పూర్వ వసతి గహంలో నివసించుచున్న విద్యార్థిని/ విద్యార్థుల కొరకు 2025-26 విద్యా సంవత్సరంలో 2500 జతలకు ప్రభుత్వం వారు నిర్ణయించిన ధర జతకు రూ.80 ప్రకారం దుస్తులు కుట్టడంకొరకు కొటేషన్ ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి. జి.రమేష్ తెలిపారు. కావున, కృష్ణాజిల్లా పరిధిలోగల స్టిచ్చింగ్ ఏజెన్సీల వారు కొటేషన్‌ను జిల్లా వెనుకబడిన తరగతుల, సాధికారిత అధికారి వారి కార్యాలయం, కలెక్టర్ కాంపౌండ్, మచిలీపట్నం, కష్ణాజిల్లా వారి కార్యాల యంలో ఈ నెల 11 తేదీ సోమవారం మధ్యాహ్నం మూడుగంటల లోగా సమర్పించాలన్నారు. పూర్తి వివరములకు యస్.వెంకట దిలీప్ 9299004162ను సంప్రదించాలన్నారు.

వర్లపై వ్యాఖ్యలకు ఖండన

ప్రజాశక్తి-పామర్రు : ప్రజా సేవకుడు అంటే ఎలా ఉండాలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాని చూసి నేర్చుకోవాలని పామరు నియోజకవర్గ జనసేన ఇన్చార్జి తాడిశెట్టి నరేష్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో పాత్రికేయులు సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో అవినీతికి మారు అయిన మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ప్రస్తుత ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాపై లేనిపోని విమర్శలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ ఆధీనంలో నడిచే యూరియా, డిఎపి ఎరువులలో అక్రమాలు జరుగుతున్నాయని ఆయా మండలాల్లో అధికారులకు వినతి పత్రాలు ఇస్తూ వారి సమయం వృథా చేస్తున్నారన్నారు. ఇది పూర్తిగా అవాస్తవమని జిల్లాలోనే ఎరువులు ఎక్కువగా అందించిన మండలాల్లో పామర్రు నియోజకవర్గం తోట్లవల్లూరు, పమిడిముక్కల మండలాలు మొదటి స్థానంలో ఉన్నాయన్నారు. నిత్యం నియోజకవర్గ ప్రజలమధ్య ఉండే కుమార్ రాజా పై అక్కసుతో కైలే అనిల్ వెంట క్యాడర్ లేక అభద్రత భావంతో నిందలు వేస్తున్నారని అన్నారు. వర్లపై వ్యక్తిగత విమర్శలు చేస్తే చట్టపరంగా చర్యలకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-పమిడిముక్కల : పమిడిముక్కల మండలంలోని రౌడీషీటర్లకు ఎస్ఐ బి. శ్రీను ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. నేరాలకు దూ రంగా ఉండాలని, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. చట్టవ్యతిరేక కార్యకలా పాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. భవిష్యత్తులో నిఘా కొనసాగుతుందని హెచ్చరించారు.

కాకాని 125వ జయంతి

ప్రజాశక్తి-ఉయ్యూరు : మాజీ మంత్రి కాకాని వెంకరత్నం జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆకునూరులో కాకాని విగ్రహానికి ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్, గ్రామసర్పంచ్ గోలి వసంత కుమార్, టీడీపీ గ్రామ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మంత్రిగా రాష్ట్రానికి, జిల్లాకు విశేష సేవలందించి ఉక్కు కాకానిగా పేరొందిన మహా నాయకుడు కాకాని వెంకటరత్నం అని కీర్తించారు.

మిక్కిలినేని పాపారావుకు నివాళి

ప్రజాశక్తి-చల్లపల్లి : కార్మిక సంఘం నేత రైతు నాయకులు మిక్కిలినేని పాపారావు (92) శనివారం రాత్రి ఆయన స్వగృహంలో కన్నుమూశారు. ఆయనకు భార్య కుమారుడు ఉన్నారు. లక్ష్మీపురం చక్కెరమ కర్మాగారం సంఘ నేతగా కార్మిక సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని పోరాటం చేసిన ఆయన తరువాత రైతుల, ప్రజల సమస్యల కోసం కషి చేశారు. ఆయన కుమారుడు మిక్కిలి లేని మధు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులుగా కొనసాగు తున్నారు. ఆదివారం ఉదయం పాపారావు భౌతిక కాయాన్ని అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, మాజీ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రకార సంతాపం తెలిపారు. అలాగే సిపిఎం మండల పార్టీ కార్యదర్శి యద్దనపూడి మధు, సిఐటియు మండల కన్వీనర్ మహమ్మద్ కరీముల్లా, సిఐటియు జిల్లా మాజీ ఉపాధ్యక్షులు శీలం నారాయణరావు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్, రాష్ట్ర రైతు సంఘం నాయకులు హనుమాన్ ల సురేంద్రనాథ్ బెనర్జీ, ఎంపీపీ కోట విజయ రాధిక, కృష్ణకుమారి, మండల వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, టిడిపి నేత, చల్లపల్లి ఉపసర్పంచ్ ముమ్మనేని రాజ్ కుమార్ తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు.



నివాళులర్పిస్తున్న ఎంఎల్ఏ బుద్ధప్రసాద్

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలంలోని గొడవర్రుకు చెందిన కరెంట్ పనిచేసే బొడ్డు శేఖర్ (జోసెఫ్)విద్యుదాఘాతంకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి 10 వేలు ఆర్థికసాయం ప్రకటించారు. ఆ నగదును మండల పార్టీ అధ్యక్షురాలు మాదు శ్రీహరిరాణీ, సర్పంచ్ మేరుగ చంద్రశేఖర్‌లు అందజేశారు. నేతలు కాగిత రాజారమేష్, మోహనరావు, మావులూరి కృష్ణా పాల్గొన్నారు.

నేటి నుంచి 'మెడికల్ అండ్ హెల్త్ సైన్స్ ఎగ్జిబిషన్'



పిన్నమనేనిలో మనిషి పుట్టుకకు సంబంధించిన నమూనాలు పరిశీలిస్తున్న డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం చిన్న ఆవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ ఆసుపత్రిలో ఈనెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వారం రోజుల పాటు మెడికల్ అండ్ హెల్త్ సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిద్ధార్థ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ సివి రావు తెలిపారు. ఆదివారం మెడికల్ కాలేజ్ క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పిన్నమనేని సిద్ధార్థ హాస్పిటల్, మెడికల్ కాలేజ్ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా మెడికల్ రంగంలో వస్తున్న మార్పులపై ప్రజల్లో అవగాహన పెంచడానికి మెడికల్ అండ్ హెల్త్ సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వారం రోజులపాటు జరిగే ఈ ఎగ్జిబిషన్లో మెడికల్ విద్యార్థులు తయారు చేసిన హెల్త్ కి సంబంధించిన ప్రాజెక్టులను ప్రదర్శిస్తారని చెప్పారు. ముఖ్యంగా మనిషి లో మెదడు, గుండె సంబంధిత సమస్యలు, వాటిపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. అదేవిధంగా ఎముకలకు సంబంధించిన సమస్యలు పరిష్కార మార్గాలను కూడా విసిదీకరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమలోకి ప్రజలు, విద్యార్థులు, సీనియర్ సిటిజెన్లు వచ్చేందుకు వీలుగా ఏర్పాట్లు చేశామన్నారు. ఎగ్జిబిషన్లోకి ఉచిత ప్రవేశం కల్పించామన్నారు. వైద్య రంగంలో వస్తున్న, ఆపరేషన్ వ్యవస్థలో వస్తున్న మార్పులను, చికిత్స విధానం పైన ప్రజలకు చక్కటి అవగాహన కల్పిస్తామన్నారు. గ్రామస్థాయిలోకి మెడికల్ అండ్ హెల్త్ సైన్స్ ఉపయోగాలను తీసుకువెళ్లడమే ఈ ఎగ్జిబిషన్ ఉద్దేశమన్నారు. అనంతరం ఎగ్జిబిషన్ లో ప్రదర్శించే ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీజీ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎంవి. భీమేశ్వర్, డాక్టర్ బి అనిల్ కుమార్, దంత వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రామోజీరావు తదితరులు పాల్గొన్నారు.



ముగిసిన నెఫ్రాలజీ దక్షిణ భారత వార్షిక సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ఆగస్టు 1 నుండి 3, వరకు దక్షిణ భారత నెఫ్రాలజీ సంఘం 44వ వార్షిక సదస్సు విజయవంతంగా విజయవాడలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ నెఫ్రాలజీ సంఘం అధ్యక్షులు డా. అమ్మన్న, డాక్టర్ శివరామకృష్ణ సారథ్యంలో ఘనంగా నిర్వహించారు. సదస్సును డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విసి డాక్టర్ చంద్రశేఖర్ ఘనంగా ప్రారంభించారు. ఈ సదస్సుకు 600 మందికిపైగా ప్రతినిధులు దేశ విదేశాల నుండి హాజరయ్యారు. 300కిపైగా శాస్త్రీయ వ్యాసాలు సమర్పించబడి నెఫ్రాలజీ రంగంలో తాజా పరిశోధనలకు ప్రతిబింబంగా నిలిచాయి. ప్రధానంగా కిడ్నీ వ్యాధులు, డయాలసిస్, కిడ్నీ మార్పిడి, నూతన ఔషధాలు, సాంకేతిక పురోగతులు వంటి అంశాలపై చర్చించారు. బెంగళూరుకు చెందిన డాక్టర్ స్వామినాథన్, జెనో ట్రాన్స్‌ప్లాంటేషన్ భవిష్యత్ పథాలపై, వైద్య పరిశోధనలో జరుగుతున్న విప్లవాత్మక అభివృద్ధులపై ప్రత్యేక ప్రసంగం ఇచ్చారు. హైదరాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ నెఫ్రాలజీ విభాగాధిపతి డాక్టర్ మంజుషా రైతుల్లో జరుగుతున్న పరాక్వాట్ విషపానం, ఆత్మహత్యలు, మరణాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ, ఈ విషపూరిత రసాయనాన్ని నిషేధించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు.



రోడ్డు ప్రమాదంలో బాలుడు దుర్మరణం

ప్రజాశక్తి - ఎ.కొండూరు : తిరువూరు విజయవాడ జాతీయ రహదారిపై ఎ.కొండూరు మండలం చీమలపాడులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు దుర్మరణం చెందిన సంఘటన ఇది. సేకరించిన వివరాల ప్రకారం ఎ.కొండూరు మండలం కేశ్యా తండాకు చెందిన బాణావతు నంద్యా నాయక్ ఆదివారం తన కుమారుడు బాణావతు యశ్వంత్(6)ను వెంటపెట్టుకొని చీమలపాడు గ్రామానికి వెళ్లి రోడ్డు దాటుతుండగా తిరువూరు వైపు నుండి విజయవాడ వైపు వెళ్తున్న కారు అతివేగంగా అజాగ్రత్తగా వచ్చి ఢీకొనడంతో ముక్కుపచ్చలారని బాణావత్ యశ్వంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తిరువూరు వైపు నుండి విజయవాడ వైపు వెళుతున్న స్విఫ్ట్ కారు ఏపీ 39 ఎల్వీ 00056 నంబర్ గల కారు అతివేగంగా వచ్చి బాలుని ఢీకొనడంతో బాలుడు రోడ్డుపై పడటంతో తలకు బలమైన గాయమైనట్లు ప్రత్యక్ష సాక్షుల ద్వారా తెలిసింది. కారును షాకం శివారెడ్డి అనే యువకుడు నిర్లక్ష్యంగా, అతివేగంగా నడిపినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. బాలుడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మన్నీరుగా విలపిస్తున్నారు.

ఫన్ టైమ్స్ క్లబ్ వేదికగా సామూహిక పుస్తక పఠనం

ప్రజల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు 'పేజ్ క్లబ్' అద్వితీయ కార్యక్రమం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విజ్ఞాన సముపార్జనతో పాటు, మనో వికాసానికి పుస్తక పఠనం ఎంతో అవసరం. నేటి డిజిటల్ యుగంలో పుస్తక పఠనం క్రమక్రమంగా కనుమరుగైపోతోంది. పుస్తక పఠనమంటేనే అదో ప్రహసనంగా భావించబడుతున్న పరిస్థితుల్లో కొందరు చిన్నారుల సంకల్పం పుస్తక పఠన మహోద్యమంగా మారింది. ప్రజల్లో పుస్తక పఠనాసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఆవిర్భవించిన పేజ్ క్లబ్ అబాలగోపాలన్నీ ఒక్కచోటికి చేర్చి పుస్తకం పట్టేలా చేసింది. పేజ్‌క్లబ్ ఆధ్వర్యంలో పటమట ఫన్‌టైమ్స్ క్లబ్‌లో ఆదివారం జరిగిన ఈ అద్వితీయ కార్యక్రమంలో దాదాపు 200 మంది పాల్గొని పుస్తక పఠనం చేశారు. చిన్నారుల నుంచి వయో వృద్ధుల వరకు, విద్యార్థుల నుంచి వివిధ రంగాల్లో నిష్ణాతులైన వ్యక్తుల వరకు... అందరూ ఒకే వేదిక పైకి వచ్చి పుస్తక పఠనం కావించారు. ప్రభాత సమయంలో నిర్వహించిన ఈ కార్యక్రమం పుస్తక పఠన వెలుగులను ప్రస్ఫుటంగా ప్రసరింపజేసింది. పుస్తక పఠనం పట్ల చైతన్య స్ఫూర్తిని కలిగించిన 'పేజ్ క్లబ్'కు ఏడాది కిందట అంకురార్పణ జరిగింది. పుస్తక పఠనాన్ని ప్రతి ఒక్కరికీ అలవాటు చేయాలనే సంకల్పంతో, ప్రస్తుతం 11,12 గ్రేడ్ చదువుతున్న ఐదుగురు విద్యార్థులు 'పేజ్ క్లబ్'కు రూపకల్పన చేశారు. పుస్తక పఠనం ఆవశ్యకతను తెలియజేసేలా వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు, కర్మాగారాల్లో పుస్తక పఠన కార్యక్రమాలను నిర్వహించారు. స్మార్ట్‌ఫోన్ యుగంలో కనుమరుగైపోయిన పుస్తక పఠనాసక్తిని పునరుద్ధరించడం కోసం 'పేజ్ క్లబ్' మొక్కవోని పట్టుదలతో శ్రమించింది. వారి ప్రయత్నం ఫలించి, ఆదివారం నిర్వహించిన సామూహిక పుస్తక పఠనం విజయవంతమైంది. 'పేజ్ క్లబ్ ఆవిష్కర్తలైన విహాన్ సాయి వేములపల్లి, ఈషాన్వి నిమ్మగడ్డ, జైదేవ్ చౌదరి అవిర్నేని, మోక్షిత్, రోనక్ బగ్రేచాల స్వప్నం ఫన్ టైమ్స్ క్లబ్ వేదికగా సాకారమైంది. పేజ్ క్లబ్ చేపట్టిన పుస్తక పఠనోద్యమానికి వివిధ వర్గాల వారి నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. తమ గృహ సముదాయాల్లో, కార్యాలయాల్లో పుస్తక పఠన కార్యక్రమాలను నిర్వహించాల్సిందిగా 'పేజ్ క్లబ్' నిర్వాహకులను పలువురు స్వాగతించారు.



పుస్తకాలతో విద్యార్థులు

తనిఖీకి వెళ్లలేదని నిలిపేసిన వికలాంగ పింఛను

అధికారుల నిర్లక్ష్యమే శాపంగా మారిన వైనం

ప్రజాశక్తి - నందిగామ : పెన్షన్ ఎప్పుడు వస్తుందా అని ఆశగా ఎదురుచూసే వికలాంగులకు ఈనెల షాక్ తగిలింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రతినెలా ఒకటిన వచ్చే పింఛన్ ఆగిపోయింది. తక్షణమే పెన్షన్ దారులవ్వాలని సిపిఎం డిమాండ్ చేసింది. తనిఖీలకు వెళ్లలేకపోయిన వికలాంగులకు జులై, నెల పింఛనును అధికారులు నిలిపివేశారు. జనవరి నుంచి వైద్య బృందాలు వికలాంగుల పింఛనుదారుల ధ్రువపత్రాలను తనిఖీ చేస్తున్నారు. తనిఖీకి రావాలని రెండు కేటగిరీలకు చెందిన వికలాంగులకు సెర్ప్ నుంచి సమాచారం వచ్చింది. వెళ్లేందుకు సిద్ధమవుతుండగా ప్రక్రియ వాయిదా వేసినట్లు నందిగామలో కొందరు వార్డు సచివాలయ సిబ్బంది చెప్పడంతో ఆగిపోయారు. ఫలితంగా ఒక్క నందిగామలోనే 110 మంది వికలాంగులకు పింఛను ఆగిపోయింది. ప్రతినెలా మందులకు ఉదయం పూట అల్పాహారానికి సాదర ఖర్చులు, కుటుంబ పోషణ, అద్దెలు చెల్లించడం వంటి అవసరాలు పింఛన్‌తోనే ముడిపడి ఉండటంతో పెన్షన్ ఎప్పుడు వస్తుందో తెలియక అయోమయంలో పడ్డారని సిపిఎం పట్టణ కార్యదర్శి కటారపు గోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెన్షన్ ఈరోజే ఇవ్వాలి. చాలామంది విజయవాడ వైద్య పరీక్షల నిమిత్తం వెళ్లలేనివారున్నారు. వారికి ప్రభుత్వం వైద్య పరీక్షలు నందిగామలోనే నిర్వహించేలా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని, ఈ నెలాఖరులోపు వైద్య పరీక్షలు పూర్తి చేయాలని సిపిఎం నాయకులు కటారపు గోపాల్, శ్రీనివాసరావు, రవి శేఖర్ తదితరులు డిమాండ్ చేశారు.



బాధితులతో మాట్లాడుతున్న దృశ్యం

ముగిసిన పత్తి గింజ, నూనె కాన్‌క్లేవ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : భారత సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ - అఖిల భారత కాటన్ సీడ్ క్రషర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడలోని హోటల్ వివాంత వేదికగా ఆరో కాటన్ సీడ్, ఆయిల్ అండ్ మీల్ సమావేశం జరిగింది. 'పత్తి గింజలకు నూతన ప్రాణం - నూనె, ఇతర వినియోగాల్లో అభివృద్ధి దారులు' అనే అంశంపై సదస్సు జరిగింది. తొలుత ఈ కార్యక్రమాన్ని పొన్నూరు శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ధూళిపాళ్ల నరేంద్ర మాట్లాడుతూ 'పత్తి పరిశ్రమలో ప్రముఖుల మధ్య ఈ వేదికపై భాగస్వామిగా ఉండటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. భారత సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ సంఘం వైస్ ప్రెసిడెంట్ అంగ్సు మాలిక్ మాట్లాడుతూ 'వ్యవసాయ రంగానికి వ్యూహాత్మకంగా ప్రాముఖ్యత కలిగిన విజయవాడలో 6వ కాన్‌క్లేవ్‌ను నిర్వహించడం ఎంతో గర్వకారణం అన్నారు. ఈ సంవత్సరం తీసుకున్న ప్రధాన అంశం పత్తి గింజను ఆరోగ్యకరమైన వంట నూనెగా మాత్రమే కాకుండా, పశు పోషకాహార రంగానికి కీలకంగా గ్రామీణాభివృద్ధికి దోహదపడే వనరుగా ఉపయోగించాలన్న తమ సంకల్పాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. కాటన్ సీడ్ క్రషర్స్ అసోసియేషన్, ఛైర్మన్ సందీప్ బజోరియా మాట్లాడుతూ 'పత్తి గింజ నూనె వంటగదుల్లో అత్యంత ప్రాచుర్యం పొందిన నూనె అన్నారు. ఇతర నూనెల రుచి, వాసన ప్రమాణాలను అందనా వేయడంలో ఇది ప్రామాణికంగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కాన్‌క్లేవ్ ద్వారా పత్తి గింజ నూనె వినియోగాన్ని ప్రోత్సహించడం, శుద్ధీకరణ సాంకేతికతలను అభివృద్ధి చేయడం, పత్తి ఆధారిత ఉత్పత్తులను ప్రాచుర్యంలోకి తేయడంపై దృష్టి పెట్టామన్నారు. సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ సంఘం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ బి.వి. మెహతా , కాటన్ సీడ్ క్రషర్స్ అసోసియేషన్ , ఉపాధ్యక్షుడు, ధనలక్ష్మి కాటన్ అండ్ రైస్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, గుంటూరు సంస్థ డైరెక్టర్ వైస్ ఛైర్మన్ పి. వీర నారాయణ ,ఐసీఏఆర్-సర్కాట్, ముంబయి డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె. శుక్లా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టిని కలిసిన ఎంఎల్ఎ తాతయ్య

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : జగ్గయ్యపేట నియోజకవర్గంలోని పోలంపల్లి ఆనకట్ట తాత్కాలిక మరమ్మతులకు అనుమతివ్వాలని తెలంగాణా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కును జగ్గయ్యపేట ఎంఎల్ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య కోరారు. ఆదివారం భట్టిని కలిసిన ఎంఎల్ఎ మాట్లాడుతూ పోలంపల్లి ఆనకట్ట తెలంగాణ రాష్ట్ర పరిధిలో ఉండటంవల్ల ఆ ప్రాంత రైతుల భూములు కోతకు గురై మునేరులో కలిసిపోవడం వల్ల ఆనకట్ట తాత్కాలిక మరమ్మతులు చేసేందుకు తెలంగాణ రైతులు అడ్డుపడుతున్నారని పేర్కొన్నారు. దీంతో ఆనకట్ట తాత్కాలిక మరమ్మతులకు అనుమతి మంజూరు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ పొన్నం బాలాజీ, కోటూరు సత్యనారాయణ ప్రసాద్, తోట నాగమల్లేశ్వరరావు (బుజ్జి), యార్లగడ్డ విశ్వనాథం, చిట్టూరి మౌలేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ

సిసి కెమెరాల ద్వారా నేరాలను అరికట్టొచ్చు

ప్రజాశక్తి - వత్సవాయి : పెనుగంచిప్రోలు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాలు అరికట్టే అవకాశం ఉందని స్థానిక ఎస్ఐ అర్జున్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, సీసీ కెమెరాల వల్ల భద్రత ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. గ్రామంలోని ప్రధాన రహదారులు బస్టాండ్ చౌరస్తాలో ఏర్పాటు చేస్తే నేరాలను అరికట్టవచ్చని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ పెద్దలు, దాతలు సహకరించాలని సూచించారు. గడిచిన మూడు నెలల కాలంలో 7 దొంగతనాలు జరిగాయని సీసీ కెమెరాలు వల్లనే నిందితులను త్వరగా గుర్తించి బాధితులకు న్యాయం చేయగలిగామని తెలిపారు. ఇటీవల బైపాస్ రోడ్ లో తాళం వేసిన ఇంట్లో జొరబడి దొంగిలించిన అరకేజీ వెండి 30 వేల రూపాయల నగదును 24 గంటలు సమయములోనే నిందితులను అదుపులోకి తీసుకొని చోరీకి గురైన మొత్తాన్ని రికవరీ చేశామన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ ఎస్సై గిరి సాయి, సిబ్బంది పాల్గొన్నారు.

పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - వత్సవాయి : మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులో వేంచేసి ఉన్న తిరుపతమ్మ దేవస్థాన దర్శనానికి ఆదివారం పోటెత్తారు. సెలవు రోజు కావడంతో పాటు శ్రావణమాసం పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి జిల్లాల నుంచి యాత్రికులు వేలాదిగా తరలివచ్చారు. యాత్రికులు అధిక సంఖ్యలో దూర ప్రాంతాల నుంచి పాల్గొన్నారు.